శుక్రవారం
08-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 166
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మార్చి 17న రష్యా అధ్యక్ష ఎన్నికలు

మాస్కో: రష్యాలో మార్చిలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఓటింగ్ తేదీని చట్టసభ సభ్యులు నిర్ణయించారు. 2024, మార్చి 17న అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. దీంతో ఐదవసారి అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ ఎన్నికకు మార్గం సుగమమైంది. ఎన్నికల తేదీ ప్రతిపాదనను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎన్నికల ప్రక్రియపై రష్యా ఎన్నికల సంఘం శుక్రవారం సమావేశం కానుంది. పుతిన్ ఆరేళ్ల పదవీకాలం 2024లో ముగుస్తుంది. మరో రెండుసార్లు అధ్యక్ష పదవికి పోటీ చేసేలా చట్టాన్ని ఇటీవల తీసుకు రావడంతో 2036 వరకు ఆయన పదవిలో ఉండేందుకు ఆస్కారం కలిగింది.

గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల

త్వరలో గ్రూప్-1 ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. వివిధ విభాగాల నుంచి మొత్తం 897 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ పోస్టులు 331, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 566 ఉన్నాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గురువారం వెల్లడించింది. మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్, డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ప్రొబెషనరీ ఎక్సైజ్ తదితర విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టులున్నాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో భాగంగా ఏపీ సచివాలయంతో పాటు వివిధ భాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈనెల 21 నుంచి జనవరి 10వ తేదీ వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. పాత సిలబస్ ఆధారంగానే పరీక్ష ఉంటుంది. గ్రూప్-2 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతిచ్చింది. గ్రూప్-2 పోస్టుల వివరాలు psc.ap.gov.in వెబ్‌సైట్లో పొందవచ్చు. అయితే గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ త్వరలో విడుదల కానుంది. వరుసగా నోటిఫికేషన్లు వస్తుండటంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ విపత్తుగా మిచౌంగ్

- ఇ-క్రాప్‌తో సంబంధం లేకుండా కౌలు రైతులకు సాయం
- ఎకరాకు రూ.40 వేలు పరిహారం చెల్లించాలి
- రామకృష్ణ డిమాండ్

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సీపీఐ బృందం పర్యటన

విశాలాంధ్ర బ్యూరో–ఏలూరు/భీమవరం: మిచౌంగ్ తుపాన్‌ను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ ప్రతినిధి గురువారం పర్యటించింది. వర్షాలకు తడిసి ముద్దయిన వరి పంటలను పరిశీలించింది. రైతులను కలిసి వివరాలు తెలుసుకుంది. ఏలూరు జిల్లా రూరల్ మండలం చాటపర్రు శివారు గ్రామం తిమ్మారావుగూడెంలో నీట మునిగిన పంట పొలాలను రామకృష్ణ, ఇతర నేతలు పరిశీలించారు. అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకు వర్షాభావంతో రైతులు నష్టపోయారని, తాజాగా తుపాను కారణంగా ఆరుగాలం రైతు కష్టపడి పండించిన పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. రాష్ట్రంలో 970 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, దీంతో తుపాను కారణంగా భయానక విపత్తు సంభవించిందన్నారు. తుపాను సమాచారం ముందుగానే వాతావరణ శాఖ తెలియజేసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించి... రైతులను నట్టేట ముంచిందని విమర్శించారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.30 నుండి రూ.45 వేల వరకు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. ఎంత నష్టం జరిగినా పూర్తి పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా కౌలు రైతులు జిల్లాలో విపరీతంగా నష్టపోయారన్నారు. వారికే పూర్తి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నీట మునిగిన వరి ధాన్యం రంగు మారి వాసన వస్తోందని, రంగు మారినా, తడిచినా తేమశాతంతో నిమిత్తం లేకుండా మద్దతు ధరకే ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు తీసుకున్న రుణాలను పూర్తిగా రద్దుచేసి, తిరిగి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఆంక్షలు సడలించి పంటల బీమా వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి

- మిగతా 2 లో

అరకొర సాయం

- బాధితుల ఎదురుచూపు
- ముంచిన మిచౌంగ్
- మందకొడిగా సహాయక చర్యలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: మిచౌంగ్ తుపాన్, భారీ వర్షాలతో నష్టపోయిన బాధిత రైతులు, గ్రామీణ పేదలు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ తుపాన్ ప్రభావంతో పేదల కాలనీలన్నీ నీట మునిగి నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం అరకొరగానే సాయం అందిస్తూ హడావుడీ చేస్తున్నట్లు విమర్శలున్నాయి. బాధితులకు పూర్తిస్థాయిలో సేవలందించాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్షాలపై వైసీపీ నేతలు మాటల దాడికి దిగుతున్నారు. బాపట్ల కేంద్రంగా తుపాన్ తీరం దాటాక దాని ప్రభావంతో వచ్చిన ఈదురుగాలులు, భారీ వర్షాలతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. రైతులు పండించిన పంట నేలపాలైంది. నూర్పిడి చేసి కల్లాలపై ఉన్న ధాన్యం అంతా తడచిముద్దైంది. కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి, బాపట్ల, నెల్లూరు, కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అల్లూరి సీతారామరాజు తదితర తుపాన్ ప్రభావిత జిల్లాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. జగనన్న కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్యుత్, మంచినీటి సౌకర్యం పునరుద్ధరించలేదు. చేతికొచ్చిన ధాన్యం పంట నేలపాలవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యంతోపాటు అరటి, శనగ, పొగాకు, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. ఇంకా పొలాల్లోనే వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. తడచిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తేమశాతం అధికం పేరుతో ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల శాఖాధికారులు ముందుకు రావడం లేదు. చేపలు, రొయ్యల చెరువులు నీటమునిగి రైతులు నష్టాలకు గురయ్యారు. రోడ్లపై పడిన చెట్లు తొలగించకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేనందునే ఈ దుస్థితి నెలకొంది. తుపాన్ ప్రభావంతో ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను

- మిగతా 2 లో

కొలువైన కొత్త సర్కారు

సీఎంగా రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంగా భట్టి

- మంత్రులుగా మరో 10మంది ప్రమాణ స్వీకారం
- ఎల్బీ స్టేడియంలో అట్టహాసంగా కార్యక్రమం
- ఆరు గ్యారంటీల దస్త్రంపై తొలి సంతకం
- హాజరైన సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితర ప్రముఖులు

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గురువారం మధ్యాహ్నం 1.21 నిమిషాలకు ప్రమాణస్వీకారం చేశారు. సీఎంతో పాటు 11 మంది మంత్రులతో గవర్నర్ తమిళిసై ప్రమాణం చేయించారు. కాంగ్రెస్ అధినాయకత్వం, వివిధ రాష్ట్రా ల ముఖ్యమంత్రులు, పార్టీల నేతలు, వేలాదిగా జనం తరలిరాగా... లాల్‌బహదూర్ స్టేడియంలో అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రులు వరుసగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలు

- మిగతా 2 లో

ఇక ఏపీ రాజకీయం

- ఎన్నికలపై పార్టీల దృష్టి
- తెలంగాణ ఫలితాలపై చర్చ
- 'ఇండియా' వైపు చంద్రబాబు చూపు?
- అయోమయంలో పవన్
- పొత్తులపై తర్జన భర్జన
- బీజేపీ, వైసీపీకి వామపక్షాలు దూరం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఇక అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు 2024 సార్వత్రిక ఎన్నికలపై దృష్టి పెట్టాయి. తెలంగాణ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్‌పై ఎంతమేరకు ప్రభావం చూపుతాయనేదీ చర్చనీయాంశంగా మారింది. అందులో భాగంగా పొత్తుల వ్యూహాల్లో రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావాలని వైసీపీ ప్రయత్నిస్తోంది. దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రతిపక్ష టీడీపీ, వామపక్ష పార్టీలున్నాయి. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ గెలుపుతో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు సైతం ఇండియా కూటమి వైపునకు వెళ్లే అంశంపై సమాలోచనలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఏపీలో టీడీపీ-జనసేన పొత్తులో ఉన్నాయి. అటు బీజేపీతోనూ జనసేన జట్టు కట్టింది. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ-జనసేన ఉమ్మడిగా పోటీ చేసినా పవన్ కల్యాణ్ పార్టీకి ఒరిగిందేమీ లేదు. బీజేపీ కేవలం ఎనిమిది సీట్లకే పరిమితమైంది. జనసేన పోటీ చేసిన ఎనిమిది స్థానాల్లోనూ ఓటమి పాలైంది. ఏడు స్థానాల్లో ఆ పార్టీకి డిపాజిట్ గల్లంతైంది. ఈ రాజకీయ సమీకరణలతో కర్నాటక నుంచి తెలంగాణ వరకు కాంగ్రెస్ పట్ల ఆదరణ స్పష్టంగా కనిస్తోంది. దేశంలో ఇండియా కూటమి ఏర్పాటు అనంతరం దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇండియా కూటమిలోకి వెళ్తేనే మంచిదని టీడీపీలోని కొంతమంది నేతలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. అటు టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన నేతలు మాత్రం బీజేపీతోనే పొత్తు కొనసాగాలని పట్టుపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం హైదరాబాద్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. బీజేపీతో పొత్తు లేకుంటేనే మంచిదనే అభిప్రాయంతో చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. వారిద్దరి భేటీ జరిగిన మరుక్షణమే చంద్రబాబు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే అవకాశముందని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో జనసేనతో తమ పార్టీ పొత్తు ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. బీజేపీ నేత వ్యాఖ్యల్ని టీడీపీ నేతలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



సార్ సర్... వరద బాధితులని పరామర్శించడానికి వస్తుంటే మనరోడ్లు బాగలేక మీకు దెబ్బలు తగిలాయని విన్నాను!

కూనంనేనికి రాజా అభినందన

ఏపీకి రూ.493 కోట్లు

- తమిళనాడుకు రూ.450 కోట్లు
- 'చెన్నై బేసిన్' వరద నిర్వహణకు రూ.561.29 కోట్లు
- మంజూరు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు మిచౌంగ్ తుపాను ధాటికి అతలాకుతమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, మెరుపు వరదలతో రెండు రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరిగింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు రూ.493.60 కోట్లు, తమిళనాడుకు రూ.450 కోట్ల వరద సాయాన్ని కేంద్రం ప్రకటించింది. మిచౌంగ్ తుపాను కారణంగా రెండు రాష్ట్రాలలో ఊళ్లకు ఊళ్లు ముంపునకు గురయ్యాయి. ఆస్తి, పంట నష్టం తీవ్రంగా వాటిల్లింది. వేల ఎకరాల్లో పంట నీటిపాలైంది. పీడిత రాష్ట్రాలను ఆదుకునేందుకు ఎస్డీఆర్ఎఫ్‌కు రెండవ విడత చెల్లింపులను ముందస్తుగా విడుదల చేసేందుకు కేంద్ర హోంశాఖ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు హోంమంత్రి అమిత్‌షా గురువారం 'ఎక్స్' మాధ్యమంగా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రూ.493.60 కోట్లు, తమిళనాడు రాష్ట్రానికి రూ.450 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎన్డీఎంఎఫ్ కింద చెన్నై బేసిన్ కోసం సమగ్ర పట్టణ వరద నిర్వహణ

- మిగతా 2 లో

మానవతా విపత్తు రానివ్వద్దు: గుటెర్రస్

ఐరాస/జెరూసలేం: మానవతా విపత్తు రానివ్వద్దు అని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తెలిపారు. సంక్షోభం తీవ్రతరం కాకుండా ఆపాలని, తక్షణమే కాల్పుల విరమణ కోసం ఆయన డిమాండ్ చేసింది. గాజాపై దాడులను ఇజ్రాయిల్ ఆపకపోతే మానవతా విపత్తు తప్పబోదని భద్రతా మండలిని గుటెర్రస్ హెచ్చరించారు. ఇందుకోసం తనకున్న ప్రత్యేక అధికారాన్ని వినియోగించారు. ఇలాంటి సందర్భం చాలా అరుదు. మానవతా సంక్షోభం, ప్రజల వెతలు, భౌతిక విధ్వంసం వంటివి రెండు నెలలకుపైగా జరిగిన దాడుల పర్యవసానాలన్నారు. తీవ్ర హాని నుంచి పౌరులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఐరాస చార్టర్‌లోని అధికరణ 99ను ప్రస్తావించారు. అంతర్జాతీయ శాంతి, భద్రతలకు ముప్పు ఉందని నమ్మితే భద్రతా మండలి సభ్యులకు హెచ్చరిక చేసే అధికారం ఐరాస ప్రధాన కార్యదర్శికి ఉంటుందని అధికరణ 99 చెబుతుంది. 'ఈ సంక్షోభం తీవ్రరూపం దాల్చకుండా, పరిస్థితి మరింత క్షీణించకుండా ఆపే బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉంది' అని గుటెర్రస్ అన్నారు. గాజాలో మానవతా కాల్పుల విరమణ కోసం ఒత్తిడి తెచ్చే విధంగా భద్రతా మండలి చర్చించాలని గుటెర్రస్ సూచించారు. పోరు ఆపాలని ఐరాసకు సంబంధించిన శక్తిమంతమైన సంఘం డిమాండ్ చేయడం అత్యవసరమని పలస్తీనా ఐరాస రాయబారి రియాద్ మన్సూర్ తెలిపారు. అయితే ఇజ్రాయిల్‌కు మిత్రపక్షమైన అమెరికాకు భద్రతా మండలిలో వీటో అధికారం ఉండటంతో కాల్పుల విరమణకు మద్దతు ఇవ్వకపోవడం విదితమే.

హమాస్ చీఫ్ ఇంటిని చుట్టుముట్టిన ఐడీఎఫ్

ఇజ్రాయిల్ దళాలు ఖాన్ యూనియస్‌లో భీకర దాడులు కొనసాగించాయి. ఆ ప్రాంతాన్ని రక్తసిక్తం చేశాయి. హమాస్ కీలక నేతలను తుడిచి పెట్టేందుకు భూతల, వైమానిక దాడులను సాగిస్తున్నాయి. హమాస్ గాజా అధినేత యాహ్యా సిన్వర్‌పై గురి పెట్టాయి. ఆయన ఇంటిని ముట్టడించాయి. ఈ మేరకు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటన చేశారు.

యాహ్యా సిన్వర్ హమాస్ దాడులకు సూత్రధారని ఆరోపించారు. ఖాన్ యూనిస్‌లో దాడులను ఉధృతం చేసినట్లు వీడియోను విడుదల చేశారు. సిన్వర్ ఇప్పటికే వెళ్లిపోయి ఉంటాడని, తమ దళాలు అతనిని త్వరలోనే చేరుకుంటాయని నెతన్యాహు దీమా వ్యక్తంచేశారు. ఇదిలావుంటే ఇజ్రాయిల్ నిర్విరామంగా జరుపుతున్న దాడులతో గాజా ప్రజలు ఎక్కడికి వెళ్లాలో, ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. ఉత్తర గాజా శిథిలమైంది. అక్కడి ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. ఇప్పుడు దక్షిణ గాజాలో భీకర పోరుతో ఉత్తర గాజా పరిస్థితే పునరావృతం అవుతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. కాగా ఇజ్రాయిల్‌ను అడ్డుకునేందుకు పాకిస్థాన్ సాయాన్ని హమాస్ కోరినట్లు పాక్ మీడియా పేర్కొన్నట్లు తెలుస్తోంది.

తుపాకుల మోత

అమెరికాలో ముగ్గురు, రష్యాలో ఇద్దరు మృతి

విద్యాసంస్థల్లో ఘటనలు

మాస్కో/బ్రసెల్స్/లాస్‌వేగస్: తుపాకీ సంస్కృతి నానాటికీ పెరిగిపోతోంది. రష్యా, బ్రసెల్స్, అమెరికాలో కాల్పుల ఘటనలు నమోదయ్యాయి. అమెరికాలో ముగ్గురు, రష్యాలో ఇద్దరు చనిపోగా బ్రసెల్స్‌లో నలుగురికి గాయాలయ్యాయి. అమెరికా వర్సిటీలో, రష్యాలోని స్కులులో కాల్పులు కలకలం రేపాయి. రష్యా, బ్రైయాన్స్క్ నగరంలోని స్కూల్లో ఎనిమిదో తరగతి బాలిక కాల్పులు జరుపగా ఇద్దరు చనిపోయారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఆ బాలిక తనను తాను కాల్చుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. బ్రసెల్స్‌లోని ప్రముఖ షాపింగ్ వీధిలో బుధవారం రాత్రి జరిగిన కాల్పుల్లో నలుగురికి గాయాలయ్యాయి.

వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇది ఉగ్రదాడి కాదని, కాల్పులకు పాల్పడిన దుండగులు పరారీలో ఉన్నారని వెల్లడించారు. అమెరికా, లాస్‌వేగస్‌లోని నెవెడా యూనివర్సిటీలో ముగ్గురు కాల్చివేతకు గురికాగా ఒకరికి గాయాలయ్యాయి. అనుమానితుడిని కాల్చి చంపినట్లు పోలీసు అధికారి చెప్పారు. అతనిని మట్టుబెట్టి ఉండకపోతే అనేక ప్రాణాలు పోయేవని షెరీఫ్ కెవిన్ మెక్‌మహిల్ తెలిపారు.

12న వియత్నాంకు జిన్‌పింగ్

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈనెల 12 నుంచి వియత్నాంలో పర్యటించనున్నారు. సోషలిస్టు ఇరుగు-పొరుగు దేశాలతో సంబంధాలను పెంచుకోవడమే జిన్‌పింగ్ పర్యటన ఉద్దేశమని బీజింగ్ విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. జిన్‌పింగ్ మంగళవారం వియత్నాం వెళతారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చునింగ్ ప్రకటించారు. వియత్నాం అధినేతలు న్యూయెన్ ఫు ట్రోంగ్, వోవాన్ ట్రోంగ్ ఆహ్వానం మేరకు జిన్‌పింగ్ వియత్నాంలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. సమగ్ర వ్యూహాత్మక సహకారాన్ని మరింత పెంపొందించుకోవడంపై జిన్‌పింగ్ ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తారన్నారు.

కూనంనేనికి రాజా అభినందన

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా గురువారం కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావును అభినందించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం, మఖ్దూం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కూనంనేనికి రాజా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకట్ రెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, ఎం. బాలనరసింహ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి హాజరైన డి.రాజా

తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరయ్యారు. ఢిల్లీ నుండి విమానంలో ఉదయం హైదరాబాద్ వచ్చిన రాజా... ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. దీంతో ప్రమాణ స్వీకార వేదిక ఎల్బీ స్టేడియానికి ఆలస్యంగా చేరుకున్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలుసుకొని అభినందించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, సీపీఐ తరపున రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీకి రూ.493 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

కార్యకలాపాలకుగాను తొలిసారి పట్టణాల్లో వరద తీవ్రతను తగ్గించే ప్రాజెక్టుకు రూ.561.29 కోట్ల (కేంద్ర సాయం రూ.500 కోట్లు కలిపి)ను ప్రధాని మంజూరు చేసినట్లు అమిత్‌షా తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్ మొదటి విడత చెల్లింపులు ఇప్పటికే రెండు రాష్ట్రాలకు జరిగాయని, ఈ క్లిష్టసమయంలో బాధితులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. మిచౌంగ్ తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో 770కిమీల రోడ్లు కొట్టుకుపోగా అనేక చెట్లు నేలకూలాయి. పశుసంపదకు నష్టం జరిగింది. 194 గ్రామాలకు చెందిన 40 లక్షల మందితో పాటు రెండు పట్టణాలపై తీవ్రత ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోని 25 గ్రామాలు ముంపునకు గురైనట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) డేటా చెబుతోంది. మరోవైపు తమిళనాడు రాజధాని చెన్నైను మిచౌంగ్ అల్లకల్లోలం చేయగా వర్షపు నీరు నిలిచిపోయి ఉండటం, విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చెన్నై ముంపునకు గురి కావడం ఎనిమిదేళ్లలో ఇది మూడవసారిగా అమిత్‌షా పేర్కొన్నారు. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలతో మెరుపు వరదలు సంభవిస్తున్నట్లు వెల్లడించారు. వరదలను తట్టుకొనేలా చైనాకు మిటిగేషన్ ప్రాజెక్టు దోహదమవుతుందన్నారు. పట్టణ వరద నిర్వహణ సిరీస్‌లో భాగంగా చర్యలు తీసుకోగా రాబోయే రోజుల్లో వీటిని మరింతగా విస్తరిస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇదిలావుంటే తమిళనాడులోని వరద పీడిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వేను కేంద్రప్రభుత్వ ప్రతినిధిగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిర్వహించారు. రాష్ట్రానికి జరిగిన నష్టంపై సీఎం స్టాలిన్‌తో చర్చించారు. చెన్నై, కాంచిపురం, చెంగల్‌పేట్, తిరువల్లూర్‌లు ముంపునకు గురయ్యాయి. కాగా, మొత్తం రూ.5,060 కోట్ల కేంద్ర సాయాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

ఇథనాల్ ఉత్పత్తికి చెరకు రసం వాడొద్దు

చక్కెర ధరల అదుపునకు కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న చక్కెర ధరల అదుపు కోసం ఇథనాల్ ఉత్పత్తికి చెరకు రసం వినియోగించకుండా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు చక్కెర మిల్లులు, డిస్టిలరీలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దేశీయ అవసరాలకు తగినంత చక్కెరను అందుబాటులో ఉంచడంతో పాటు ధరలు పెరగకుండా చూడాలన్న ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ చక్కెర మిల్లులకు, డిస్టిలరీలకు గురువారం లేఖ రాసింది. చెరకు ప్రధానంగా పండించే రాష్ట్రాల్లో ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో దిగుబడి తగ్గింది. దీంతో చక్కెర ధరలకు రెక్కలు వచ్చాయి. ఇథనాల్ తయారీకి చెరకు రసాన్ని, సుగర్ సిరప్ వాడకాన్ని నిలిపివేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. అయితే, బి-హెవీ మొలాసిస్‌కు మినహాయింపు ఇచ్చింది. ఆయిల్ మార్కెట్ కంపెనీలకు బి-హెవీ మొలాసిస్ నుంచి తీసిన ఇథనాల్ సరఫరా కొనసాగుతుందని కేంద్రం స్పష్టం చేసింది.

తెలంగాణ ప్రభుత్వానికి సహకరిస్తా: మోదీ

న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డిని ప్రధాని మోదీ అభినందించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి సాధ్యమైనంత మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి అభినందనలు. రాష్ట్రాభివృద్ధికి, అక్కడి ప్రజల సంక్షేమానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇస్తున్నానని ప్రధాని తన ట్విటర్‌లో పోస్టు చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన విషయం విదితమే.

సీఎం జగన్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో కొలువుతీరిన కొత్త ప్రభుత్వాన్ని అభినందిస్తూ గురువారం సీఎం ట్వీట్ చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు, మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదర భావం, సహకారం పరిఢవిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు జగన్ పేర్కొన్నారు.

ఇక ఏపీ రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

ఎవరూ ఖండించకపోవడంతో చంద్రబాబు ఇండియా కూటమి వైపు చూస్తున్నారనే ప్రచారానికి బలం చేకూరుతోంది. 2018 ఎన్నికల్లోనూ తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీ కలిసి పోటీ చేసిన విషయం విదితమే. రాబోయే ఎన్నికల్లో పొత్తులపై చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది.

వైసీపీ వ్యూహాలకు అడ్డుకట్ట

ఏపీలో అధికార పార్టీ వైసీపీ వ్యూహాలకు అడ్డుకట్ట వేయడం కోసం ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు నిమగ్నమయ్యాయి. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఆ పార్టీలు పనిచేస్తున్నాయి. గత ఎన్నికల్లో వైసీపీ 151 అసెంబ్లీ సీట్లతో అధికారం చేజిక్కించుకుంది. పార్లమెంట్ సీట్లను అత్యధికంగా 22 గెలుచుకుంది. మళ్లీ అంతకంటే ఎక్కువ సీట్లు గెలుపొందాలనే లక్ష్యంతో అనేక ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు జగన్ శ్రీకారం చుట్టారు. సామాజిక సాధికార యాత్రల పేరుతో వైసీపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు బస్సు యాత్రలు నిర్వహిస్తున్నారు. ఏపీకి సీఎం జగన్ ఎందుకు కావాలంటే ?, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలతో ముందుకు పోతూ ఆ పార్టీపై ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇంతకుముందు జగనన్న సురక్ష, ఆరోగ్యరక్ష తదితర కార్యక్రమాల్ని గ్రామ, వార్డు సచివాలయాలు కేంద్రంగా వైసీపీ నిర్వహించింది. మళ్లీ ఆరోగ్యశ్రీలో మార్పులు, ఇతరత్రా సంక్షేమ పథకాలతో ప్రజలను ఆకర్షించేందుకు జగన్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రతిపక్ష పార్టీలు సైతం ఎప్పటికప్పుడు ప్రభుత్వ విధానాలను, అవినీతిని ఎండగడుతూ ముందుకు సాగుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబుకు బెయిల్ అనంతరం నిలిపివేసిన తన పాదయాత్రను లోకేశ్ పునఃప్రారంభించారు. ఎన్నికల షెడ్యూలును దృష్టిలో ఉంచుకుని ఆయన విశాఖ వరకే పాదయాత్ర కొనసాగించనున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించడం కోసం అక్కడ కాంగ్రెస్, సీపీఐ, ఇతర చిన్న పార్టీలు ఏకమయ్యాయి. ఏపీలోనూ అదే వ్యూహంతో ముందుకు వెళ్తున్నాయి. ఇండియా కూటమిలోకి చంద్రబాబు వస్తే ఇక్కడ రాజకీయ పరిస్థితులకు అనుకూలత ఏర్పడే అవకాశం ఉంది.

పవన్ ఊగిసలాట

రాబోయే ఎన్నికల నాటికి ఇండియా కూటమిలోకి చంద్రబాబు వెళ్తే...పవన్ కల్యాణ్ రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం కానున్నది. తెలంగాణ ఫలితాల అనంతరం పవన్ కల్యాణ్ అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనీయబోమన్న లక్ష్యంతో ఉన్న పవన్... బీజేపీని వీడి బయటకు రావాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలని సూచిస్తున్నాయి. ఇప్పటికే ఏపీలో టీడీపీ, జనసేన పొత్తుతో ముందుకు వెళుతున్నాయి. టీడీపీ, జనసేన మధ్య సీట్ల లెక్కలే తేలాల్సి ఉంది. బీజేపీ నేతల మాటలు నమ్మి ఆ పార్టీతోనే పవన్ ఎన్నికలకు వెళ్తే... ఏపీ ఎన్నికల్లోనూ తెలంగాణ తరహా ఫలితాలు తప్పేలా లేవు. 2019 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ రెండుచోట్ల పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ పార్టీకి ఒకే ఒక్క సీటు దక్కింది. తెలంగాణ ఫలితాల అనంతరం గుణపాఠం నేర్చుకుని బీజేపీని పవన్ వీడాల్సిన పరిస్థితులున్నాయి. లేకుంటే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చకుండా చూస్తామంటూ పవన్ చేసిన వ్యాఖ్యలకు పసలేకుండా పోతుంది. కేంద్రంలోని బీజేపీతో పరోక్షంగా, ప్రత్యక్షంగా జతకట్టే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని విపక్షాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని జగన్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను చీల్చి, వారిని తమ వైపునకు తిప్పుకుని... బీజేపీ అధికారం చెలాయిస్తోంది. ఇదే విధానాన్ని తెలుగు రాష్ట్రాల్లో అమలుకు ప్రయత్నిస్తోంది. ఏపీలో వైసీపీపై ఉన్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు ఆ పార్టీ నేతలు అక్రమ ఓట్ల నమోదు రాజకీయాలకు పాల్పడుతున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

హైదరాబాద్, ఏపీలో రెండు చోట్ల కలిపి 4,30, 264 డబుల్ ఓట్లు ఉన్నాయంటూ ఎన్నికల ప్రధాన అధికారికి వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకుగాను వైసీపీ ఈ తరహా రాజకీయాలకు తెరదీసిందని విపక్షాలు మండిపడుతున్నాయి. ఇప్పటికైనా వైసీపీ నేతలు ఓట్ల రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజాసమస్యలపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది.

జాతీయ విపత్తుగా మిచౌంగ్

(మొదటిపేజీ తరువాయి)

జగన్ తాడేపల్లి ప్యాలెస్‌ను వీడి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను పరామర్శించి భరోసా కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులు పంటపొలాల్లో పర్యటించి వాస్తవాలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. తుపాను ప్రభావంతో చనిపోయిన వారికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర బృందాన్ని పంపించి నష్టాన్ని అంచనావేసి జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా ఉండిలోనూ సీపీఐ బృందం పర్యటించింది. నేలకొరిగిన పంట పొలాలను, తడిసి ముద్దయిన ధాన్యం రాశులను, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించింది. ఉండి మార్కెట్ యార్డు వద్ద రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ హృదయ విదారకర దృశ్యాలు అడుగడుగునా కనిపిస్తున్నాయని, కౌలు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని, కోట్లాది రూపాయలు నీటిపాలయ్యాయని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌కు రైతులంటే ద్వేషమని, ఇంత విపత్తు సంభవించినా తాడేపల్లి ప్యాలెస్ నుండి కాలు కదపలేదని నిప్పులు చెరిగారు. మొలకెత్తి ధాన్యం కొంటున్నామని మంత్రి కారుమూరి ప్రకటనలిస్తున్నారని, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. అన్ని జిల్లాల్లో సీపీఐ ప్రతినిధి బృందాలు పర్యటిస్తున్నాయని, రాష్ట్రంలో కరువు పరిస్థితులు, తుపాన్ పంట నష్టాలపై ఈ నెల 9న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

కౌలు రైతుకే సాయం: ముప్పాళ్ల

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను అల్లకల్లోలం సృష్టించిందని, తుపాను హెచ్చరికలు ముందుగానే వచ్చినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. జగన్ అధికారంలోకి వచ్చాక డ్రైన్ల ప్రక్షాళన జరగలేదని, గోతాలు, టార్పాలిన్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. మొలకెత్తిన, తడిచిన ధాన్యాన్నంతటినీ మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చాలా జిల్లాల్లో కౌలు రైతులు 65 నుండి 78 శాతం వరకు సాగులో ఉన్నారని, వీరిలో దళితులు, అణగారిన వర్గాలు పెద్ద సంఖ్యలో ఉన్నారని, అందువల్ల ఇ-క్రాప్‌తో సంబంధం లేకుండా సాగులో ఉన్న కౌలు రైతులకు పరిహారం అందించాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. ఉండి మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబెట్టుకుంటున్న కౌలు రైతులు పొన్నాటి రామారావు, పొన్నాటి మల్లమ్మ, జామి శ్రీనివాసరావు, కొంగరపు ప్రభాకర్, అల్లు సత్యనారాయణ, పి.శ్రీనివాసు తదితరులను సీపీఐ బృందం కలిసి పంట నష్టం వివరాలు తెలుసుకుంది.

ప్రతినిధిబృందంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, డేగా ప్రభాకర్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కార్యదర్శులు మన్నవ కృష్ణ చైతన్య, కోనాల భీమారావు, సీపీఐ, రైతు, వ్యవసాయ కార్మిక, మహిళా సంఘాల నాయకులు కలిసెట్టి వెంకట్రావు, ఉప్పులూరి హేమశంకర్, బండి వెంకటేశ్వరరావు, పొటేలు పెంటయ్య, పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, కడుపు కన్నయ్య, మన్నవ యామిని, బుగ్గల ప్రభాకర్, కురెళ్ల వరప్రసాద్, మావూరి విజయ, గొర్లి స్వాతి, ఎం సీతారాం ప్రసాద్, చెల్లబోయిన రంగారావు, సికిలే పుష్పకుమారి, కళింగ లక్ష్మణరావు, సనపల శ్రీనివాసరావు, కోన గొల్లయ్య, ఎం.లక్ష్మీపతి, వైవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అరకొర సాయం

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించింది. ఎనిమిది జిల్లాల్లో 320 పునరావాస కేంద్రాల్ని ఏర్పాటు చేసింది. ఆయా శిబిరాలకు వచ్చిన బాధితులకు భోజన, మంచినీటి సౌకర్యాలు సమకూర్చడం లేదని, నిత్యావసర సరుకుల పంపిణీ అరకొరగానే కొనసాగుతోందని పేర్కొంటున్నారు.

శిబిరాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో బాధితులకు ఆర్థిక సాయంగా ప్రకటించిన రూ.2500 ఇవ్వడం లేదని తెలుస్తోంది. రైతులకు తక్షణ సాయం కింద ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు ఎకరాలకు రూ.50వేలు ఇవ్వాలని, కౌలు రైతులందరికీ పరిహారం చెల్లించాలని, పంట రుణాలు రద్దు చేయాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని బాధితులు కోరుతున్నారు. తడిసిన ధాన్యాన్ని నాణ్యతతో నిమిత్తం లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అభ్యర్థిస్తున్నారు. తుపాన్ ప్రభావంతో నష్టపోయిన బాధిత రైతులను, ప్రజలను ఆదుకోవాలని, ప్రభుత్వపరంగా తక్షణమే పరిహారం ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.



కొలువైన కొత్త సర్కారు

(మొదటిపేజీ తరువాయి)

సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కర్నాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం.శివకుమార్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సుఖు, కేసీ వేణుగోపాల్ తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముందు రేవంత్‌రెడ్డి తన ఇంటి నుండి నేరుగా జూబ్లిహిల్స్‌లోని పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయానికి చేరుకుని కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు. అక్కడి నుండి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ తదితర ప్రముఖులకు సాదరంగా స్వాగతం పలికారు. వారంతా విమానాశ్రాయం నుండి నేరుగా ఎల్బీ స్టేడియానికి చేరుకున్నారు. ముందుగా సోనియాతో కలిసి రేవంత్‌రెడ్డి సభా ప్రాంగణానికి వచ్చారు. తరువాత రాహుల్, ప్రియాంక గాంధీ అక్కడికి చేరుకున్నారు. 1.16నిమిషాలకు ఎల్బీస్టేడియానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను రేవంత్‌రెడ్డి స్వయంగా వెళ్లి స్వాగతించారు. అనంతరం 1.21 నిమిషాలకు రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా ఆయన తరువాత ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, మంత్రులుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ధనసరి అనసూయ అలియాస్ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు వరుస క్రమంలో 1.24 నుండి 1.46నిమిషాల వరకు ప్రమాణ స్వీకారాలు చేశారు. ప్రమాణ స్వీకారోత్సవం ఆనంతరం గవర్నర్‌కు వీడ్కోలు పలికిన రేవంత్‌రెడ్డి... తిరిగి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆనంతరం ముందుగా ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీలకు సంబంధించిన అభయహస్తం ఫైల్ పై తన తొలిసంతకం చేశారు. అనంతరం ఎన్నికల ముందు ప్రకటించిన విధంగానే దివ్యాంగురాలయిన రజినీకి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ రెండో ఫైల్ పై సంతకం చేశారు. అనంతరం సరిగ్గా 2గంటలకు ఆయన ప్రజలనుద్దేశించి ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన సరిగ్గా 9నిమిషాల పాటు అనర్గళంగా తనదైన శైలిలో ఆకట్టుకునే ప్రసంగం చేశారు.

పాలకులం కాదు... మీ సేవకులం

ముందుగా జై సోనియాగాంధీ అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన రేవంత్... మేము పాలకులం కాదు తెలంగాణ ప్రజల సేవకులమంటూ మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ ప్రజా ప్రభుత్వమని అభివర్ణించారు. అటు రాష్ట్ర సచివాలయంతో పాటు ప్రగతిభవన్ ద్వారాలు ప్రజలు ఎప్పటికీ తెరిచే ఉంటాయన్నారు. ఎవరికీ ఎలాంటి సమస్యలున్నా... నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. అనేక పోరాటలు, త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. ప్రజలకు స్వేచ్ఛ ఇవ్వాలనే లక్ష్యంతో నాడు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాని దశాబ్ద కాలంగా రాష్ట్రంలో గత పాలకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి మానవ హక్కులకు భంగం కలిగించారన్నారు. నేడు ప్రజారాజ్యాన్ని అధికారంలోకి తీసుకువచ్చి ప్రజా పాలనను స్థాపించడం జరిగిందని... దీనికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయంతో పాటు తెలంగాణ నలుమూలల సమాన అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రజలు కూడా భాగస్వామ్యులేనని... ఎవరైనా మంచి సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చన్నారు. మీ ప్రతి మాటను ప్రభుత్వం గౌరవిస్తుందని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నూతన ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. మీ బిడ్డగా నేను బాధ్యతలు తీసుకుని మీకోసం పనిచేసి మీ అకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా నిరుద్యోగ, విద్యార్థి, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేసేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామని రేవంత్ హామీ ఇచ్చారు.

నేటినుంచే ప్రజాదర్బార్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే శుక్రవారం నుంచే ప్రజాదర్బార్‌ను ప్రారంభించనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రతి రోజు ఉదయం 10గంటలకు అక్కడ ప్రజాదర్బార్ నిర్వహించడం జరుగుతుందని... ప్రజలు నేరుగా అక్కడికి చేరుకుని వారి సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని రేవంత్ తెలిపారు. ప్రగతిభవన్ పేరును మహాత్మ జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌గా మార్పు చేసినట్లు ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్ర సచివాలయానికి డా. బీఆర్.అంబేద్కర్ పేరు ఉన్నందున ప్రగతిభవన్‌కు పూలే పేరును పెట్టినట్లు సమాచారం.

ప్రగతిభవన్ ముందు బారికేడ్ల తొలగింపు

ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ఇక్కడ తాను ప్రమాణ స్వీకారం చేసే సమయానికి అక్కడ ప్రగతిభవన్ ముందు వున్న కంచెలను బద్దలు కొట్టామని రేవంత్ తెలిపారు. నిజానికి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసే సమయానికి ప్రగతిభవన్ గేటు ముందు గతంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి వాహనాల రాకపోకలకు అనుమతించారు. ఉదయం నుంచి అక్కడ అధికారులు బారికేడ్ల తొలగింపు చేపట్టారు. మధ్యాహ్నానికి అక్కడ గ్యాస్ కట్టర్లతో మొత్తం బారికేడ్లు, ఇనుప కంచెల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. మరో రెండు మూడు రోజుల్లో మిగతా వాటిని కూడా తొలగించనున్నారు.

హోరెత్తిన ఎల్బీస్టేడియం

సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా నాయకులు, కార్యకర్తల నినాదాలతో ఎల్బీస్టేడియం హోరెత్తింది. ముఖ్యంగా సరిగా 1.04నిమిషాలకు సోనియాగాంధీతో కలిసి రేవంత్‌రెడ్డి సభా ప్రాంగణానికి చేరుకున్న సమయంలో నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అలాగే పార్టీ యువత నేతలు రాహుల్,ప్రియాంక గాంధీ చేరుకున్న సమయంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. అదేవిధంగా రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ప్రారంభించగానే ఎల్బీ స్టేడియం రేవంత్ నినాదాలతో హోరెత్తింది. కాని సీతక్క ప్రమాణ స్వీకారోత్సం చేస్తున్న క్రమంలో అంతకంటే పెద్దఎత్తున నినాదాలు, హర్షధ్వానాలు రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

బాధ్యతలు చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి సాయంత్రం 5గంటల సమయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అయనకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమార్, డీజీపీ స్వాగతం పలికారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆనంతరం అక్కడే ఉన్న సచివాలయ ఉద్యోగులను కలిసి వారిని పలకరించారు. ఆనంతరం సచివాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన అయన ఛాంబర్‌కు వెళ్లారు. గతంలో పనిచేసిన సీఎం ఛాంబర్ 6వ అంతస్తులో ఉండగా... ప్రస్తుతం సీఎం ఛాంబర్‌ను 4వ అంతస్తులోకి మార్చారు. ఈ సందర్భంగా వేదపండితులు రేవంత్‌కు స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం అయన తన ఛాంబర్‌లో ప్రవేశించి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నతాధికారులతో కొంతసేపు మాట్లాడారు.

మంత్రి బుగ్గనకు కరువు కనబడలేదా?

- డోన్‌లో సీపీఐ భారీ ర్యాలీ
- కలెక్టర్‌ను కలవకుండా నేతల్ని అడ్డుకున్న పోలీసులు... తోపులాట

విశాలాంధ్ర-డోన్: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి డోన్, ప్యాపిలి మండలాల్లో కరువు కనపడలేదా అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు ప్రశ్నించారు. గురువారం డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ సీపీఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ అతిథి గృహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అయితే తహశీల్దార్ కార్యాలయానికి జిల్లా కలెక్టర్ సామూన్ జిలానీ ఓటర్ల వెరిఫికేషన్‌కి వచ్చారన్న విషయం తెలియడంతో సీపీఐ నాయకులు ఆయన్ను కలవడానికి ప్రయత్నించారు. కాగా పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది వారిని ఆర్డీఓ కార్యాలయం ఎదుట రోడ్డుపై అడ్డుకున్నారు. దీంతో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసుల్ని లెక్కచేయకుండా సీపీఐ నాయకులు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. దీంతో ఒక్కసారిగా పోలీసులకు, సీపీఐ నాయకుల మధ్య తోపులాట జరిగింది. సీపీఐ నాయకులు, కార్యకర్తలు పోలీసులను తోసుకుంటూ తహశీల్దార్ కార్యాలయానికి చొచ్చుకొని వెళ్లడంతో... తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో సీపీఐ నాయకులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. రామాంజనేయులుతో పాటు పార్టీ మండల కార్యదర్శి పులి శేఖర్ ,ప్యాపిలి మండల కార్యదర్శి వెంకటేష్, నారాయణ, ప్రజానాట్యమండలి నాయకులు లక్ష్మీనారాయణ, వాసు, మధు, శివయ్యలను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్ కు తరలించారు. అయితే ఆర్డీఓ వెంకట్ రెడ్డి బయటకు వచ్చి సీపీఐ నాయకులతో మాట్లాడటంతో సమస్య సద్దుమణిగింది. నేతలు కలెక్టర్ మనజీర్ సామూన్ జిలానీని కలిసి డోన్, ప్యాపిలి మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, జిల్లా జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ... డోన్, ప్యాపిలి మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనడంతో ఈ ప్రాంత రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంత్రి బుగ్గన సొంతం మండలం బేతంచర్లను కరువు మండలంగా ప్రకటించుకుని మిగిలిన డోను, ప్యాపిలిని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కరువు మండలాలుగా ప్రకటించమంటే మంత్రి బుగ్గన సామెతలు చెప్తాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు ఉంటే సీఎం జగన్... కేంద్రాన్ని కరువు సహాయం కోరకపోగా రాష్ట్రంలో పంటలు బాగున్నాయని చెప్పడం దురదృష్టకరమన్నారు. డోన్, ప్యాపిలి మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి ఎకరాకు రూ.30వేల కరువు పరిహారంతో పాటు రైతులకు కరువు పెన్షన్ ఇవ్వాలని... విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు పూర్తిగా రద్దు చేయాలన్నారు. తక్షణమే కరువు సహాయం, ఉపాధిహామీ పథకం పనులు చేపట్టాలని కోరారు.

ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం!

ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఇక్కడి రైతులు వాపోతున్నారు. చనుగొండ్ల గ్రామానికి చెందిన రైతు కేశన్న ఆత్మహత్యలు తప్పవని చెప్పే విధంగా ఎద్దుల బండిపై రైతు ఉరి వేసుకున్నట్లు ఏర్పాటు చేసిన నమూనా ప్రజలను ఆకట్టుకుంది. పట్టణ ప్రజలు దీనిని ఆసక్తిగా గమనించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే రాధాకృష్ణ, సుబ్బరాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, వీ నారాయణ, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోట రాముడు, దళిత కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కే ప్రభాకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి బీ నారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసు, శివయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రతాప్, రంగరత్నం, మనోజ్ సిద్దు, ఏఐవైఎఫ్ నాయకులు రణత్ విజయ్ ,రాఘవేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విజయుడు, వరదరాజులు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు రామాంజనేయులు, మధు, సీనియర్ నాయకులు రామకృష్ణ,సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వేజోన్ ఎప్పుడు?

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు జేవీఎస్ మూర్తి ప్రశ్న

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ రైల్వే జోన్ ప్రారంభమెప్పుడో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాలని విశాఖ రైల్వేజోన్ సాధన సమితి కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైల్వే జోన్ ఇస్తామని చెప్పి ఐదేళ్లు గడిచినా పాలకులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. రైల్వేజోన్ ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను జేవీఎస్ మూర్తి డిమాండ్ చేశారు. 2019 ఎన్నికలకు ముందు విశాఖ పర్యటన సందర్భంగా రైల్వే జోన్‌కు ప్రధాని మోదీ హామీనిచ్చారని గుర్తుచేశారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలమివ్వలేదని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం పార్లమెంటులో చెప్పారన్నారు. జోనల్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూ.106.89 కోట్లు మంజూరు చేశామని, ఈ ఆర్థిక సంవత్సరంలో 10 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారని జేవీఎస్ మూర్తి తెలిపారు. రైల్వే భూమిని బీఆర్టీఎస్ కోసం రాష్ట్ర పభుత్వం తీసుకున్నందున, దానికి బదులుగా ముడసర్లోవలో 52.2 ఎకరాల భూమిని రైల్వేకి ప్రభుత్వం అప్పగించాలని కేంద్రమంత్రి తెలిపారన్నారు. ముడసర్లోవలో రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణాన్ని ప్రతిపాదించినట్లు చెప్పారన్నారు.

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు

నీటిని కిందకు వదిలిన అధికారులు

విశాలాంధ్ర-తాడేపల్లి: ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తింది. తుపాను ప్రభావంతో ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు బ్యారేజీలోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటికి తోడు జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కృష్ణానదిపై గల ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి భారీగా పెరిగింది. బ్యారేజీ నిల్వ సామర్థ్యం 3.09 టీఎంసీలు మించి వరద నీరు ఉండడంతో అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి నిల్వ ఉంచుతూ దిగువకు సుమారు ఏడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నాలుగు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 6667 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 2908 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో ఏడు వేల క్యూసెక్కులుగా ఉంది. భారీగా వర్షాలతో కుడి, ఎడమ కాలువలకు సాగునీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. బ్యారేజీ నుంచి దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నందున నదీ తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. లంక ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి 27 నుంచి సమ్మె

మున్సిపల్ జేఏసీ

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్): మున్సిపల్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ జేఏసీ డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నారని, సహనాన్ని కోల్పోతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోకుంటే ఈనెల 27వ తేదీ నుంచి సమ్మెబాట పట్టడం అనివార్యమవుతుందని ప్రభుత్వాన్ని జేఏసీ నేతలు హెచ్చరించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బారాయుడు మాట్లాడుతూ మున్సిపల్ ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని నాలుగేళ్ల కిందట సీఎం జగన్ ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లకు 11వ పీఆర్సీ ప్రకారం రూ.20వేల కనీస వేతనం, కరువు భత్యం ఇవ్వాలన్నారు. ప్రజారోగ్య విభాగపు ఉద్యోగులకు హెల్త్‌లోన్స్ ఇవ్వలేదన్నారు. విధుల నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే డ్రైనేజి వర్కర్ల కుటుంబాలకు రూ.30లక్షల పరిహారం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు నేటికీ అమలు కాలేదని గుర్తుచేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోని పక్షంలో అన్ని విభాగాలను కలుపుకొని 27వ తేదీ నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు అసుల రంగనాయకులు మాట్లాడుతూ రూ.20వేల జీతం, కరువు భత్యాన్ని ఇవ్వకుండా వేతనాల్లో కోతలు విధించడంతో పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగం, డ్రైవర్లు, స్కూల్ స్వీపర్లు, క్లాప్ డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లు, నాన్ పీహెచ్ ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలకు ఆర్థిక కష్టాలు తప్పడంలేదన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, రూ.26వేల జీతమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి శాశ్వత కార్మికుల జీపీఎఫ్ ఖాతాలు తెరుస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. తమ డిమాండ్ల సాధనకు దశలవారీ ఆందోళనలు చేపట్టేందుకు డిసెంబర్ 27 నుంచి మున్సిపల్ సమ్మె సైరన్ మోగిస్తామని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ-వైఎస్సార్ కార్మిక నేత వైబీ రమణ, పరుచూరి పద్రాద్ (టీఎన్‌టీయూసీ), సామి ఉదయ్‌కుమార్ (జనసేన) పాల్గొన్నారు.

శివరామిరెడ్డికి సతీ వియోగం: రామకృష్ణ సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ: శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి భార్య ఉమాదేవమ్మ (55) మృతి చెందారు. అనారోగ్యంతో ఉమాదేవమ్మ మరణించడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఉమాదేవమ్మ మరణానికి సంతాపాన్ని ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని రామకృష్ణ తెలిపారు.

వలసలు, కరువుపై 14న విజయవాడలో ధర్నా

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రకటన

విశాలాంధ్ర-విజయవాడ: వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణం ప్రతి గ్రామంలో ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో డిసెంబరు 14వ తేదీన విజయవాడలో జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో 2.40 లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని, జాబుకార్డు గల ప్రతికూలీకి ఉపాధి హామీ కింద 200 పని దినాలు కల్పించాలని, రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, రెండు పూటలా పనివిధానం తీసివేయాలని, వేసవి భృతి పునరుద్ధరించాలని, ఉపాధి హామీ కూలీలకు నష్టం జరుగుతున్న ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను తీసేసి పాతసాఫ్ట్‌వేర్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అడిగిన వారం రోజుల లోపల పనికల్పించాలని, నిర్దిష్ట సమయంలో పని కల్పించకపోతే చట్టంలో పొందుపరిచిన నిరుద్యోగ భృతి కచ్చితంగా ఇవ్వాలని, పనిప్రదేశాలలో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగాలంటే మేటీల వ్యవస్థను కొనసాగించాలని కోరారు. ఉపాధి హామీలో పని చేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి (ఫీల్డ్ అసిస్టెంట్) ఉద్యోగ భద్రత కల్పించి వారిపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) అధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులు ప్రారంభం కానందున ఇప్పటికే చాలా గ్రామాల్లో వలసలు వెళ్లారని, కరువుతో పనులు లేక వ్యవసాయ కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ధర్నా కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఉపాధి హామీ కూలీలు, పేదలు, వ్యవసాయ కూలీలు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దుర్గగుడి అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో రూ.216 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. జగన్‌కు ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందిచగా అధికారులు తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. డిప్యూటీ సీఎం, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, హోంమంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహూల్లా, మహిళా కమిషనర్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, దేవాదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు లెక్కలపై ఆసక్తి పెంచండి: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రతి మనిషి జీవితం లెక్కలతో అనుసంధానమై ఉంటుందని, అందువల్ల బాల్య దశలోనే గణితంపై పట్టుసాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు చెప్పారు. గురువారం ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో జె-పాల్ (అబ్దుల్ లతీఫ్ జమీల్ పోవర్టీ యాక్షన్ ల్యాబ్) అధ్వర్యంలో ఫౌండేషనల్ స్కూల్ ఉపాధ్యాయులకు 'ఆటలతో గణిత బోధన' అంశంపై నిర్వహించిన వర్క్ షాప్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో లెక్కలంటే భయం పారద్రోలేలా సరదా ఆటలతో నేర్పించాలని, అందుకోసం ఆసక్తికర ప్రణాళికలు రూపొందించాలన్నారు. విద్యా సాధనలో పేదరికం అడ్డు కాదని, ప్రతి ఒక్కరూ నాణ్యమైన విద్యను అందిపుచ్చుకునేలా ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. పేదరికాన్ని జయించేలా విద్యా విధానాలు కొనసాగించాలని, విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. అంకెలు, సంఖ్యలు మెలుకువలు నేర్చుకుని పిల్లలకు అర్థవంతమైన, ఆహ్లాదకరమైన అభ్యాసాలు నేర్చుకునేలా ప్రేరేపించాలన్నారు. ఈ ప్రాజెక్టులో ప్రపంచ ఖ్యాతిగాంచిన విద్యావేత్తలు, ప్రొఫెసర్లతో రూపొందించిన క్రీడావిద్య మాడ్యూళ్ల ద్వారా సులభంగా నేర్చుకోవడమే కాకుండా నిత్య జీవితంలో వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శామో జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్, జె-పాల్ బృంద సభ్యులు, ఎస్సీఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం పట్టణ ప్రాంత వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. తొలుత ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఈసీ) వాహనాన్ని గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, జన ఔషధి సుగమ్ పోషణ్ అభియాన్, ఉజ్వల 2.0, పీఎం ఆవాస్ యోజన తదితర స్టాళ్లను సందర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వంద శాతం లబ్ధిదారులకు చేర్చే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరుగుతోందన్నారు. గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో పథకాలపై అవగాహన కల్పించి, అర్హత ఉండి ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి పథకాలను అందేలా చేస్తున్నట్లు వివరించారు. బలహీన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా వారికి పథకాలను చేరువచేసేందుకు ఈ కార్యక్రమం అమలవుతోందన్నారు. మహిళల సారథ్యంలో అభివృద్ధికి ప్రధానమంత్రి కృషి చేస్తున్నారన్నారు. మహిళలు, స్వయం సహాయ సంఘాల మహిళలు వ్యవసాయరంగంలో సాంకేతికతను ఉపయోగించుకునే దిశగా ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి మహిళా కిసాన్ డ్రోన్ కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ డ్రోన్లను ఉపయోగించేందుకు శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. వందేళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలలోపు అమృత కాలంలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన పనులు భారత్‌ను, ప్రజలను ఉన్నత శిఖరాలకు చేర్చుతాయన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు పట్టణాలు, గ్రామాల మధ్య అంతరాలను తొలగిస్తాయని గవర్నర్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐఈసీ మెటీరియల్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. సమాజానికి విశేష సేవలందించిన వారిని సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేయించారు. గృహ నిర్మాణం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ... గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతంగా జరుగుతోందని, గురువారం నుంచి రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో యాత్ర జరుగుతుందని చెప్పారు. ప్రజలందరూ పెద్దఎత్తున భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, కృష్ణాజిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్సీ రుహుల్లా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పీ సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనేలా ఏర్పాట్లు: హరికిరణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మిచౌంగ్ తుపాను ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసింది. వర్షం తెరిపి ఇవ్వడంతో పంటలను, పంటోత్పత్తులను కపాడటానికి వ్యవసాయ శాఖ చర్యలను వేగవంతం చేసింది. రంగుమారిన, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశామని శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్తలతో క్షేత్ర సందర్శనలను చేపడుతూ సాంకేతిక సలహాలు, పంట రక్షణకు సూచనలు ఇచ్చామని చెప్పారు. వర్షపునీరు చేల నుంచి పూర్తిగా తొలిగాక పంటనష్టం అంచనా వేసేలా బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పొలాల్లో నీరు నిల్చివుంటే పనలను గట్లపైకి తెచ్చి వాటిని విడతీసి ఉప్పు ద్రావణం చల్లేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పంట కోతకు సిద్ధంగా ఉండి, పైరు నిలువుమీద ఉన్న పొలాల్లో నీరు ఉంటే, మడుల నుంచి నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేపట్టి, పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నేలకొరిగిన వరి దుబ్బులను నిలబెట్టి, కట్టలుకట్టే ప్రక్రియ జరుగుతున్నట్లు చెప్పారు.

ఆశాల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

విశాలాంధ్ర-కడప రూరల్: గత పద్దెనిమిదేళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు అనేక సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం ఇవ్వడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏపీ ఆశా వర్కర్ యూనియన్, ఏఐటియుసి రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు గురువారం సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ నిరాహార దీక్షల శిబిరాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి సుభాషిణి ప్రారంభించారు. అనంతరం వారు దీక్షనుద్దేశించి మాట్లాడుతూ... ఆశాలకు వేతనం రూ.15 వేల మేర పెంచుతూ జీవో జారీ చేయాలని, సాధారణ సెలవులు, వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు, రిటైర్ అయిన ఆశాలకు నెలకు రూ.పదివేల పెన్షన్ ఇవ్వాలని, ఆశాలను సచివాలయాలకు బదలాయింపు, ఎఫ్‌ఆర్ఎస్ ను ఉపసంహరించుకోవాలని, పది లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని, కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న టీబీ, మలేరియా, లెప్రసీ, కరోనా అలవెన్సులు టీఏ, డీఏలు తక్షణం చెల్లించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు,డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు రోజురోజుకీ పెరుగుతున్న ప్పటికీ ఆశాల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. 365 రోజులు, 24 గంటలు అధికారులు ఆశాలను భయపెట్టి చేయించుకుంటున్నారన్నారు. వైసీపీఐ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆశాలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం ఇచ్చి ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... ముఖ్యమంత్రి కాగానే ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి కూడా ఆశాలకు వర్తింప చేయలేదని దుయ్యబట్టారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరుస్తానని మాట ఇచ్చి మహిళలైన ఆశా లను తిరోగమన దిశకు తీసుకెళ్లిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని విమర్శించారు. వైద్య రంగంలో పనిచేస్తున్న ఆశా వర్కర్స్‌ను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని... అంతవరకు 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలని, కొత్త యాపులను ఉపసంహరించుకోవాలని, రికార్డులను ప్రభుత్వమే సరఫరా చేయాలని నాణ్యమైన సెల్‌ఫోన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఆశాల సమస్యలు పరిష్కరించాలని... లేని పక్షంలో ఈనెల 21వ తేదీన విజయవాడలో జరుగుతున్న రాష్ట్రసదస్సులో సమ్మెకు పిలుపునిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, లేవాకు నాగ సుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కే సీ బాదుల్లా, జిల్లా నాయకులు పి. చంద్ర శేఖర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు.మరియమ్మ, కే కల్పన, వర్కింగ్ ప్రెసిడెంట్ బీ శాంతమ్మ, ఉప ప్రధాన కార్యదర్శి పీవీ రమణమ్మ, కోశాధికారి అమ్ములు, నగర అధ్యక్షురాలు ఏఎల్. నరసమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు శోభారాణి, బాల గంగమ్మ, సరళ, కరుణామణి, లలిత, కొండమ్మ, మంజుల, అనసూయ కత్తిజా బేగం, కళావతి, శ్రీదేవి, జమినారాణి సుజాత ముకుందా, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

Introducing of new innovation of STANES Product
in ANDHRA PRADESH & TELANGANA STATES
NOURISH PLUS (Water Soluble Mixture of Fertilizers)
NPK 13 : 12 : 10; Zn 2.00% - Mn 1.00% - Cu 1.00% Mo 0.50% - B 0.50%
Foliar Application (for ALL CROPS)
T.STANES AND COMPANY LIMITED
(A Member of the Amalgamations Group)
8/23-24, Race Course Road, Coimbatore - 641 018
Web : www.tstanes.com: Tel : 0422-2223515-17

సంపాదకీయం

"ఇండియా"ఐక్య సంఘటనకు ఆసరా

రాజకీయాలు ఎప్పుడూ నిత్య నూతనంగానే ఉంటాయి. అవి కూడా పరమపద సోపాన పటం లాంటివే. పైకి తీసుకెళ్లే పెద్ద నిచ్చెనలు ఉన్నట్టే దిగలాగే పాములూ ఉంటాయి. మరీ తేలిక భాషలో చెప్తే రాజకీయాలూ కప్పల తక్కెడే. ఎవరి భవిష్యత్తు ఎప్పుడు దశ తిరుతుందో, ఎప్పుడు కుదేలవుతుందో ఎంతకూ అంతు పట్టదు. ఆ పార్టీ ఈ పార్టీ అన్నీ తిరిగి పదవికి అవకాశం కనిపించే చోట కుదురుకోవడం ఎక్కువ శాతం మంది రాజకీయ నాయకులు అనుసరించే బాటే. తెలంగాణ సాధించింది తానేనని కె.సి.ఆర్.ఢంకా బజాయించి చెప్పుకునే వారు. రెండవ సారి తెలంగాణ ఉద్యమం సాగినప్పుడూ కె.సి.ఆర్. పార్టీతో పాటు అనేక మంది ఆ ఉద్యమంలో ఉన్నారు. గెలిచిన వాడిదే రాజ్యం కనక అధికారం దక్కడంతో ఉద్యమ ఫలితాలన్నీ కె.సి.ఆర్. జోలెలోనే పడ్డాయి. తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీ అని చెప్తున్నా 2014 లో తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి టి.ఆర్.ఎస్. మాత్రమే అధికారంలో ఉంది. పదేళ్ల తరవాత గానీ "తెలంగాణ ఇచ్చిన" కాంగ్రెస్ కు అధికారం దక్కలేదు. చివరకు కాంగ్రెస్ నాయకుడు అనుముల రేవంత్ రెడ్డి గురువారం అట్టహాసంగా ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకరించారు. ప్రమాణ స్వీకారానికి ముందు కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ప్రమాణ స్వీకార వేదిక అయిన లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియం చుట్టూ విజయోత్సాహంతో తిరిగారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మొదలైన కాంగ్రెస్ నాయకులందరూ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. రేవంత్ రెడ్డి తెలంగాణకు రెండో ముఖ్యమంత్రి. మొత్తం 12 మంది ఆయనతో పాటు మంత్రులుగా చేరితే అందులో మల్లు భట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రి. నిద్రాణమై ఉన్న కాంగ్రెస్ ను బలోపేతం చేయడంలో భట్టి విక్రమార్క కూడా రేవంత్ రెడ్డి తో కలిసి చాలా శ్రమించారు. ఆయన మొన్నటి దాకా కాంగ్రెస్ శాసనసభా పక్షం నాయకుడిగా ఉండే వారు. ఎన్నికలకు ముందు ఆయన సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించారు. కె.సి.ఆర్. అధికారంలో కొనసాగినన్నాళ్లు ఇతర పార్టీలన్నీ మాయమైనట్టే ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను చీల్చి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తే తెలంగాణలో మద్దతు సమకూరుతుందని కాంగ్రెస్ అధినాయకత్వం భావించింది. కానీ జనం కె.సి.ఆర్. మెడలో వరమాల వేశారు. కాంగ్రెస్ చిన్నబోయి నిలబడవలసి వచ్చింది. ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ ఆనవాలే లేకుండా పోయింది. ఇలాంటి స్థితిలో తెలంగాణలో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం సామాన్యమైంది కాదు. ఈ విజయానికి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కూడా దోహదపడింది. రాహుల్ యాత్ర తెలంగాణ గడ్డ మీద 21 రోజులపాటు సాగింది. ఇది కాంగ్రెస్ ను పునరుజ్జీవింప చేసింది. కానీ దీనికోసం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క లాంటి నాయకులు, అనేక మంది కార్యకర్తలు దివారాత్రాలు శ్రమించారు. ఆరు నెలల కిందటి దాకా ఉన్న కె.సి.ఆర్.కు గట్టి పోటీ ఇచ్చేది బీజేపీ అన్న భావన గాలికి ఎగిరిపోయింది. కాంగ్రెస్ క్రమంగా పుంజుకుంది. దీనికి ప్రధాన కారకుడు రేవంత్ రెడ్డి అనడంలో ఆశ్చర్యం లేదు.

అసలు కె.సి.ఆర్.ను కదిలించే సత్తా ఎవరికీ లేదు అనుకుంటున్న దశలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అనూహ్యంగా గెలిచింది. ఉత్తరాదిలో మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ రెండు రాష్ట్రాలైన ఛత్తీస్ గఢ్, రాజస్థాన్‌ను నిలబెట్టుకోగలుగుతుంది అనుకుంటే అది సాధ్యమే కాలేదు. కానీ అత్యంత బలవంతుడు అనుకున్న కె.సి.ఆర్.ను అధికారంలోంచి దింపి రేవంత్ రెడ్డి అందరినీ ఆశ్చర్య పరిచారు. రేవంత్ రెడ్డి మంత్రివర్గం చాలా పొందికగానే ఉంది. అనుభవజ్ఞులు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. ఇందులో అనేక పార్టీలలో చాంద్రాయణం చేసిన వారూ ఉన్నట్టే వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి బద్ధ విరోధులైన వారూ ఉన్నారు.మంత్రి పదవి పొందిన వారిలో తెలంగాణ ఉద్యమకారులు చాలా తక్కువే. మంత్రులైన వారిలో ఒక్క పొన్నం ప్రభాకర్ మాత్రమే మంద్ర స్థాయిలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించినట్టున్నారు. భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదరం రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రత్యేక తెలంగాణలో ఎన్నడూ క్రియాశీల పాత్ర పోషించలేదు. కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దాసరి అనసూయ ఉరఫ్ సీతక్క, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు అనేక పార్టీలలో తిరిగిన వారే. ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డికి ఎన్నడూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేదు. ఆయన మూడేళ్ల కిందటి దాకా తెలుగు దేశం పార్టీలో ఉండే వారు. నోటుకు ఓటు వివాదం తరవాత కాంగ్రెస్ లో చేరారు. మొన్నటి దాకా ముఖ్యమంత్రిగా ఉన్న కె.సి.ఆర్.కు సవాలు విసిరి రేవంత్ రెడ్డి తన సొంత నియోజక వర్గమైన కొడంగల్ తో సహా కామారెడ్డి నుంచి కూడా పోటీ చేశారు. కె.సి.ఆర్. ఈ సవాలు ను స్వీకరించి గజ్వెల్ తో పాటు కామారెడ్డిలో కూడా పోటీ చేశారు. విచిత్రం ఏమిటంటే బీజేపీ నాయకుడు వెంకట రమణ ఈ ఇద్దరు అగ్రనేతలను ఓడించి విజయం సాధించారు. కె.సి.ఆర్. రెండవ స్థానంలో, రేవంత్ రెడ్డి మూడవ స్థానంలో మిగిలిపోయారు. కొడంగల్ నుంచి పోటీ చేసిన రేవంత్ రెడ్డి ఒక సారి ఓడిపోయి ఆ తరవాత వెంటనే మల్కాజ్ గిరి నుంచి లోకసభకు ఎన్నికయ్యారు. దీన్నిబట్టి రేవంత్ రెడ్డి 54 ఏళ్ల ప్రాయం వారే అయినా అనేక ఎగుడు దిగుళ్లు చూసిన వారని తేలుతుంది. మూడవ తేదీన ఫలితాలు వెలువడుతున్న క్రమంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమై పోయిన తరవాత రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చాలా వినమ్రత ఉందని నిరూపించుకున్నారు. ఓడిన కె.సి.ఆర్. పార్టీ సహకారం కూడా కోరారు. కె.సి.ఆర్. ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లు ఆయన అధికార నివాసం ప్రగతి భవన్ దుర్భేద్యమైన కోటలా ఉండేది. మంత్రులకే అందులోకి సులభ ప్రవేశం ఉండేది కాదు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలోనే ప్రగతి భవన్‌ను అంబేద్కర్ ప్రజా భవన్ గా మార్చి అందరికీ అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు.ప్రజలందరికీ అందుబాటులో ఉంచేందుకు అందులో పూలే ప్రజా దర్బారు నిర్వహిస్తామని ప్రకటించారు. అంటే ముఖ్యమంత్రి దర్శన సులభుడవుతారు. ఇది ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా నడుపుతున్నారనడానికి నిదర్శనమే. కె.సి.ఆర్. నాయకత్వంలో బంధుప్రీతి తప్ప ప్రజాస్వామ్యం ఊసే లేదు. ఎన్నికల ప్రచార సమయంలో చేసే వాగ్దానాలలో కాంగ్రెస్ కూడా తక్కువ తినలేదు. అవి కేవలం తాయిలాలుగా మిగిలిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత రేవంత్‌దే. రేవంత్ విలేకరుల సమావేశంలో మాట్లాడినప్పుడు ఇవి కేవలం తాయిలాలు కావు, కచ్చితమైన హామీలు, భరోసాల్లా కనిపించాయి. ఈ అభిప్రాయం మారకుండా చూడడం కొత్త ముఖ్యమంత్రి బాధ్యత. కలిగిన ఉత్సాహం కొనసాగాలి. ఆశలు నెరవేరిస్తేనే 2024 సార్వత్రిక ఎన్నికలలో "ఇండియా" ఐక్య సంఘటనకు ఆసరా.

సలసలకాగే సంద్రంలో మానవాళి పడవ

ప్రభుత్వాలు, ప్రజలు చేసిన తప్పిదాలవల్ల నేడు సలసల కాగే నడిసముద్రంలో మానవాళి పడవ ప్రయాణం సాగుతోంది. గడచిన పదేళ్లకాలంలో వాతావరణం అత్యంతగా కలుషితమై, ఉష్ణోగ్రతలు పరిమితికంటే అపారంగా పెరిగిందని ప్రపంచ వాతావరణ పరిశోధన హెచ్చరిస్తూ తాజా నివేదిక ప్రకటించింది. దుబాయ్‌లో వాతావరణ మార్పులపై జరుగుతున్న 28వ కాప్ సదస్సులో నివేదిక విడుదల చేసింది. వాతావరణ మార్పులపై ఈ సంస్థ పరిశోధన నివేదికను విడుదల చేస్తుంది. అయితే దీర్ఘకాల అంచనాను, సుస్థిర ధోరణులను ఈ నివేదిక తెలిపింది. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న పరిణామాలను తెలుసుకునేందుకు తోడ్పడుతుందని డబ్ల్యుఎంఓ డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎలిన మానవ ఎంకో పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను వివరించారు.

ఎలినినో లేదా లానినో ఉన్నకాలాల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు, పసిఫిక్ సముద్రంలో నీరు అపరిమిత శీతలంగా ఉంటాయి. డబ్ల్యుఎంఓ, ఐక్యరాజ్యసమితి వాతావరణ పరిశీలన అథారిటీ నివేదికలోనూ ఎన్నో తేడాలు ఉంటాయని తెలిపాయి. పసిఫిక్ సముద్రంలో ఉష్ణోగ్రత ఎక్కువగా మార్పులను బట్టి తక్కువగానే ఉంటాయి. ప్రపంచంలోని ఆయా ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు భిన్నంగా ఉంటాయి. 2023 వాతావరణ పరిస్థితులపై జరుగుతున్న వార్షిక నివేదికలో ఈ సంవత్సరంలో భారతదేశ వాయవ్య మూల ప్రాంతాల్లోనూ పాకిస్తాన్, చైనా, అరేబియా ద్వీకపల్పంలో వాతావరణం అత్యంత శీతలంగా ఉంటుంది. 2011 నుంచి 2020 వరకు భూతాపం అధికంగా ఉన్న సంవత్సరాలని నివేదిక తెలిపింది. 1961 అలాగే 1990లో అత్యధిక ఉష్ణోగ్రతలు దక్షిణాసియాలోని కొన్నిప్రాంతాలు, ఐరోపాలో ఎక్కువ దేశాల్లో ఆఫ్రికా దక్షిణప్రాంతాల్లో, మెక్సికో తూర్పు రాష్ట్రాల్లో భూతాపం పెరిగింది.

ప్రపంచ ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. తక్కువరోజులు శీతలంగా ఉంటున్నాయి. తీవ్రమైన చలివాతావరణం చాలా తక్కువ సందర్భాలలోనే ఉంటుంది. 2011-2020 కాలంలో 1961-1990 మధ్యకాలంలో 40శాతం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భారత్‌లో మాత్రం ఎక్కువ సందర్భాలలో అత్యంత తీవ్రమైన వేడి వాతావరణం ఉందని డబ్ల్యుఎంఓ నివేదిక వెల్లడించింది. 2013, జూన్‌లో భారీ వర్షాలు, వరదలు సంభవించాయి. ఇది వర్షరుతుకాలం. అప్పుడు భారీ వర్షాలలో సహా పర్వతాలలో మంచు కరిగిపోయింది. మంచు సరస్సులు గడ్డలుగా విడిపోయి మంచుపెళ్లలు కరిగి భారీ వరదలు సంభవించాయి. ఉత్తరాఖండ్‌లో తీవ్రమైన వరదలు సంభవించి మట్టిపెళ్లలు విరిగిపడటమేకాక ఆరువేలమందికిపైగా మరణించినట్లు నివేదిక తెలియజేసింది. 2018లో వరదలు కేరళను ముంచెత్తి ఆస్తులు, ప్రాణాలు ఎక్కువగా పోయాయి. 2019, 2020లలో రుతుపవనాల సీజన్‌లలో అతిశీతల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతకు క్రితం 25ఏళ్ల కాలంలో అనేక ప్రాంతాలలో తీవ్రమైన వరదలు సంభవించాయి. 2000 సంవత్సరం తరువాత వరదలవల్ల భారత్‌లోనూ, ఇరుగుపొరుగు దేశాల్లో మరణాలు ఎక్కువగా సంభవించాయి. 2011-2020లో సామాజిక, ఆర్థిక పరిస్థితులపై మరణాలు ఎక్కువగా ఉన్నాయి. కరువులు సంభవించి తీవ్రంగా ఆహారం, నీటికొరత ఏర్పడింది. నీటిలభ్యత అందరికీ సమంగా లేదు. దేశంలో 82శాతం కుటుంబాలపై ఆహారభద్రత రిస్క్ ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా మంచుసరస్సులు ఏడాదికి ఒక మీటరుచొప్పున కరిగిపోతున్నాయి. దానివల్ల దీర్ఘకాలంగా లక్షలాది మందికి నీళ్లు సరఫరా చేయవలసి వచ్చింది. 2011-2020 మధ్య అంటార్కిటికా ఖండంలో మంచు ఫలకం దాదాపు 75శాతం కరిగిపోయాయి. 2001-2010 మధ్య కాలంలో సముద్రజలాల స్థాయి అత్యంత అధికంగా పెరిగాయి. ఇదేకాలంలో పంటలు ఉండకపోవడం వల్ల 10నుంచి 100శాతం అనేక జిల్లాలలో పరిశోధన జరపగా ఇండియా ప్రజలకు ధాన్యం పంపిణీ వ్యవస్థనే ఏర్పాటుచేసింది. ఎక్కువమందికి తినే ఆహారాన్ని అందించింది. రానున్నకాలంలో అత్యధికంగా వాతావరణమార్పులు, అతి తీవ్రమైన ఉష్ణోగ్రత పెరగవచ్చునని అధ్యయనం తెలియజేసింది. అయితే ఇంత ప్రమాదం ముంచుకొస్తున్నప్పటికీ దాదాపు అన్ని దేశాలు వాతావరణ కాలుష్యం తగ్గించేందుకు సదస్సుల్లో తీసుకున్న నిర్ణయాలను సక్రమంగా అమలు చేయకపోవడం నేటి విషాదం.

టి.వి.సుబ్బయ్య

బీజేపీని ఇండియా ఢీకొడుతుంది

నిత్య చక్రవర్తి

మరో నాలుగైదు నెలల్లో లోకసభకు జరగనున్న ఎన్నికలలో బీజేపీని ఢీకొనే సత్తా ఇండియా కూటమికి ఉంది. తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మూడు రాష్ట్రాలు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో బీజేపీ అధికారం దక్కించుకున్నది. అయితే, గెలవడానికి అవసరమైన సీట్లు కాంగ్రెస్ గెలుచుకోలేకపోయినప్పటికీ ఓట్లు గణనీయంగా 2019లో జరిగిన ఎన్నికలలో పోలైన ఓట్ల కంటే ఎక్కువగా పొందింది. ఓడిపోయినంత మాత్రాన ఇండియాకు పోటీచేసే శక్తిసామర్థ్యాలు లేవనే భావాన్ని వెలుబుచ్చుతున్నారు. 2019 లోకసభ ఎన్నికలలో కంటే చాలా మెరుగైన ఓట్లను కాంగ్రెస్ పొందింది. మూడు రాష్ట్రాలలో 65 లోకసభ సీట్లున్నాయి. దీని అర్థం ఏమిటంటే కాంగ్రెస్ ఇండియాలో భాగస్వాములుగా ఉన్న పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఫలితాలను, జరిగిన పొరపాట్లను, ఇతర అంశాలను సమీక్షించుకుని దాని నుంచి గుణపాఠం తీసుకోవాలి. సరిదిద్దుకునే మార్గంలో విశాల ప్రాంతాలలో ముమ్మరంగా ప్రచారం చేయాలి. లోకసభ ఎన్నికలకు సిద్ధమయ్యే కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. ప్రతిపక్షాలకు ఇదే కీలకమైన అంశం. 2024 మార్చి లేదా ఏప్రిల్‌లో లోకసభ ఎన్నికలు జరుగుతాయన్న సంకేతాలు ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్‌ను బహుశా ఫిబ్రవరి మొదటి వారంలో ప్రకటించే అవకాశం ఉంది. ఎన్నికలు మార్చి రెండో వారం నుంచి జరగనున్నాయన్న సంకేతాలు కూడా వస్తున్నాయి. 2019లో ఎన్నికల ప్రకటన మార్చి 10వ తేదీన వచ్చింది. పోలింగ్ ఏప్రిల్ 11న ప్రారంభమై మే 19న ముగిసింది. పోలింగ్ ఏడు దశలలో జరిగింది. ఫలితాలు మే 23వ తేదీన ప్రకటించారు. 2019లో జరిగిన ఎన్నికలతో పోల్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ నాయకత్వం ఎన్నికల తేదీలను సమీక్షిస్తుంది. ముందుగా వచ్చే ఏడాది జనవరి 22వ తేదీన అయోధ్యలో నిర్మించిన రామాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ అంశాన్ని దేశమంతటా విస్తృతంగా ప్రచారం చేసేందుకు సంఘ్ పరివార్ సిద్ధమైంది. ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శకత్వంలో దేశంలోని మారుమూల ప్రాంతాలలో సైతం రామాలయ అంశాన్ని, అలాగే లోకసభ ఎన్నికలను ఒకే సారి ప్రచారం చేస్తారు.

మోదీ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఫిబ్రవరి మొదటి వారంలో ప్రవేశపెడుతుంది. ఇంకా చెప్పాలంటే ఫిబ్రవరి 1నే బడ్జెట్‌ను ప్రవేశపెట్టవచ్చు. మహిళలు, యువత, గిరిజనులకు సంబంధించి సంక్షేమ పథకాలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రజలందరినీ ఉద్దేశించి ప్రకటించనున్న సంక్షేమ పథకాలపై ప్రధాని సలహాదారులు చర్చిస్తున్నారు. హిందూత్వ, సంక్షేమ పథకాలు ప్రధాని ప్రచారానికి బాగా ఉపయోగపడతాయి అసెంబ్లీలకు తాజాగా జరిగిన ఎన్నికల్లో ఈ పథకాలు మంచి ఫలితాలనిచ్చాయని భావిస్తున్నారు. ఈ

పథకాలకు మరింతగా పదును పెట్టి ఓటర్ల నుంచి గరిష్టంగా సానుకూల స్పందన సాధించవచ్చునని ప్రధాని భావిస్తున్నారు. అత్యంత తీవ్రంగా ఉండే లోకసభ ఎన్నికలలో బీజేపీ నుంచి ఇండియా కూటమి గట్టి సవాల్‌ను ఎదుర్కోనున్నది. ఎన్నికలకు ఎక్కువ సమయంలేదు. ఇండియా కూటమిలోని పార్టీలన్నీ పటిష్టమై ఐకమత్యంతో పోరాడాలి. మొదటి దశ ఎన్నికలు ప్రారంభంకావడానికి కేవలం మూడు నెలలు మాత్రమే సమయముంటుంది. సీట్ల పంపిణీకి సంబంధించి నిర్ణయం చేసేందుకు ఇంతవరకు సమావేశం జరపకుండా ఇండియా సమయాన్ని కోల్పోతోంది. ఈ నెల మూడో వారంలో పూర్తి స్థాయి సమావేశం జరగనున్నది. ఇండియా కూటమిలోని పార్టీలన్నీ కలిసి గరిష్ఠ ఐక్యతతో ఎన్నికల వ్యూహాన్ని రచించుకోవాలి.

జాతీయ స్థాయి ఎన్నికలు కనుక ఒక సీటులో ఇండియా కూటమి పార్టీలలో ఒక్కటే పోటీ చేయాలనేది కొన్ని రాష్ట్రాలలో సాధ్యంకాదు. ఇప్పటికే ఒక నిర్దిష్ట విధానం ఉన్నది. 80 సీట్లున్న ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి వ్యతిరేకంగా భిన్న పార్టీలకు చెందిన వారు పోటీచేస్తారు. కలిసికట్టుగా పోటీచేయనున్నందున ఈ సారి ఇండియా కూటమికి గతంకన్నా ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉన్నది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని చూసి సీట్లు కేటాయించాల్సివుంటుంది. మధ్యప్రదేశ్‌లోనూ సమాజ్‌వాదీ పార్టీకి సీట్లు కేటాయించి ఉంటే కాంగ్రెస్ గెలవడానికి అవకాశం ఉండేదని అనుకుంటున్నారు. సీట్ల పంపిణీకి సంబంధించిన బాధ్యతను శరద్‌పవార్ లేదా నితీశ్ కుమార్‌కు అప్పగిస్తే బాగుంటుందని కొన్ని పార్టీలు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశాయి. రాష్ట్రాలను మూడు విభాగాలుగా చేసి సీట్ల పంపిణీని చర్చించాలి. దేశంలో పెద్ద ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ బీజేపీని ఎదుర్కొనేందుకు ఈ విధమైన పద్ధతిని రూపొందించుకోవాలి. ప్రాంతీయ ప్రతిపక్షాలు బీజేపీపై పోటీచేసేందుకు పార్టీల బలాబలాను చూడాలి. అలాగే, ఇండియా భాగస్వామ్య పార్టీలు చేయనున్న ఐక్య కృషిని పరిగణించాలి. ఈశాన్య ప్రాంతాలు, జమ్మూ-కశ్మీర్ మరో భిన్నమైన కేటగిరి. ఇండియా బ్లాక్‌లో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీ. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, తెలంగాణ, ఒడిశాలలో కాంగ్రెస్ బలమున్న పార్టీ. ఇటీవల జరిగిన అసెంబ్లీల ఎన్నికల నుంచి వచ్చిన గుణపాఠాలను తీసుకోవాలి. ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ ప్రాంతంలో సీపీఐ బలంగావుంది. అందువల్ల కాంగ్రెస్ కొంత సర్దుబాటు చేసుకోవాలి. ఈ రాష్ట్రాలలో ఇతర ప్రతిపక్షాల బలం చాలా తక్కువగా ఉంది. అందువల్ల అక్కడ పెద్ద పార్టీలకు మద్దతివ్వాలి. కాంగ్రెసేతర పార్టీలు కూడా అక్కడున్న పరిస్థితులను బట్టి సీట్లు అడగవలసివుంటుంది. ఒడిశాలో సీపీఐ, సీపీఎంలతో కాంగ్రెస్ సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. రెండు వామపక్ష పార్టీలు అక్కడ బీజేడీ, బీజేపీని ఎదుర్కొనేందుకు ఇండియా కూటమికి మద్దతివ్వాలి. ఒడిశాలో తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు బీజేపీ ఇప్పటికే కృషిచేస్తోంది. బీజేడీతో కొన్ని సీట్లలో అవగాహన ఏర్పర్చుకోవచ్చు.

రెండో కేటగిరి కింద పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ బీజేపీకి ప్రధాన పోటీదారు అన్న విషయంలో సందేహమే లేదు. బీజేపీ, టీఎంసీపైన పోటీచేయాలన్న నిర్ణయాన్ని సీపీఎం తీసుకుంది. ఇక్కడ కాంగ్రెస్, టీఎంసీ లేదా వామపక్ష ఫ్రంట్‌తో సర్దుబాటు చేసుకోవాలా అనేది లోతుగా చర్చించుకోవాలి. టీఎంసీ నాయకురాలు మమతా బెనర్జీ బీజేపీకి 2019లో వచ్చిన 18 సీట్లను తిరిగి కూటమి గెలుచుకోవాలంటే సీట్ల పంపిణీ ఉంటేనే మంచి ఫలితం వస్తుంది. దిల్లీ, పంజాబ్ రాష్ట్రాలను ఆప్ పరిపాలిస్తున్నది. దిల్లీలో బీజేపీని ఓడించాలంటే ఆప్, కాంగ్రెస్‌లు తప్పనిసరిగా కూటమిగా ఏర్పడితే సాధ్యమవుతుంది. 2019లో బీజేపీ ఏడు సీట్లనూ గెలుచుకుంది. మధ్యప్రదేశ్‌లో తమకు సీట్లు కేటాయించలేదని ఇప్పటికే ఉన్న ఫ్రంట్‌ను సమాజ్‌వాదీ కొనసాగిస్తుందా? అనేది పెద్ద ప్రశ్న. కాంగ్రెస్ సర్దుబాటు ధోరణితో సీట్ల పంపిణీ గురించి సమాజ్‌వాదీతో చొరవ తీసుకుని మాట్లాడుతుందా? లేదా? అని ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని సమాజ్‌వాదీతో చర్చలు జరపాలి. కేరళలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ ప్రతి ఎన్నికకు పోటీపడుతున్నాయి. ఇక్కడ బీజేపీకి పెద్దగా బలంలేదు. అందువల్ల 20 సీట్లు ఇండియా కూటమే గెలుచుకుంటుంది. అలాగే, తమిళనాడు, బీహార్, జార్ఖండ్‌లలో తక్కువ సర్దుబాట్లతో పోటీచేయవలసి వస్తుంది. బీహార్‌లో మహాగట బంధన్ సీపీఐ-ఎం లిబరేషన్‌కు ఒక సీటు, సీపీఐకి ఒక సీటు కేటాయించవచ్చు. ఈ అంశంపై నితీశ్‌కుమార్, తేజస్వీ యాదవ్ తమకు గరిష్ఠంగా సీట్లు కావాలని కోరుకుంటున్నారు. వీరి రెండు పార్టీలు మంచి ఫలితానే పొందగలవని భావిస్తున్నారు. తమిళనాడు, జార్ఖండ్‌లలో సీట్ల పంపిణీలో ఇబ్బందులేమి ఉండదు.

తుపాన్లతో జీడీపీలో రెండున్నర శాతం నష్టం

బొల్లిముంత సాంబశివరావు

మిచౌంగ్ తుపాన్ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలను అతలాకుతలం చేసింది. అనేక ప్రాంతాలు జలమయమైనాయి. లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. కొన్ని ప్రాంతాల్లో రాకపోకలు ఆగిపోయాయి. తుపాన్ వలన రెండు రాష్ట్రాల్లో తీవ్రమైన నష్టం జరిగింది. రెండు రాష్ట్రాలు ప్రతి సంవత్సరం తుపాన్ తాకిడికి గురౌతూనే ఉన్నాయి. భారతదేశ తీరప్రాంతం, ప్రపంచంలోనే ఎక్కువగా తుపాన్లు తాకిడి కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ప్రపంచంలో ఏటా సంభవించే తుపాన్లతో 8శాతం భారతదేశంలోనే సంభవిస్తున్నాయి. ఎక్కువగా అక్టోబర్-డిసెంబర్ నెలల్లో వస్తున్నాయి. భారతదేశం మొత్తం వైశాల్యంలో 8శాతం ప్రాంతానికి తుపాన్ల ముప్పు పొంచిఉంది. విపత్తుల కారణంగా భారతదేశ జీడీపీలో 2 నుంచి 2.5శాతం నష్టం జరుగుతున్నట్లు ప్రపంచ బ్యాంకు అంచనావేసింది.

ప్రపంచంలో అత్యంత విపత్తుల ముప్పు కలిగిన మొదటి పది దేశాల్లో భారతదేశం ఒకటి. దేశంలో అనేక తీవ్ర తుపాన్లు సంభవించాయి. 1970లో పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లో వచ్చిన భోలా తుఫాన్ తాకిడికి 5లక్షల మంది మరణించారు. 1977 నవంబర్‌లో వచ్చిన దివిసీమ ఉప్పెనలో 9,941 మంది మరణించారు. 34లక్షలకు పైగా నిరాశ్రయులైనారు. 33,35,000 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్‌లో 10వేలమంది ప్రాణాలు కోల్పోయారు. ఒడిషాలోనే ఆ తర్వాత వచ్చిన పైలిన్ తుపాన్ ఒక్క ఒడిషా రాష్ట్రంలోని 18 జిల్లాల్లో కోటి 33 లక్షలమందిపై ప్రభావం చూపింది. తుపాన్ సృష్టించిన వరదల్లో రెండు లక్షలకుపైగా ఇళ్లు పూర్తిగా ధ్వంసమైనాయి. 4,200 కోట్లు నష్టం సంభవించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిషాలో 5.5 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 2013 మే నుంచి డిసెంబర్ మధ్యలో తూర్పు తీరంలో 5సార్లు తుపాన్లు సంభవించాయి. అవి మహాసేన (1913మే), పైలిన్ (2013 అక్టోబర్), హెలెన్ (2013 నవంబర్), కెహర్ (2013 నవంబర్), మాది (2013 డిసెంబర్) 2019-2023 మధ్య కూడా అనేక తుపాన్లు సంభవించాయి. 2021లో రెండు తుపాన్లు సంభవించాయి. మొదటిది తాక్టే తుపాన్, రెండవది గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటకలలో ఆస్థి నష్టంతోపాటు ప్రాణ నష్టాన్ని కలిగించింది. 2022లో సంభవించిన అసిని తుపాన్ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో తీవ్ర నష్టం సృష్టించింది. ఈ సంవత్సరంలోనే జావద్ తాకే, చిత్రంగ్, మాండేస్ తుపాన్లు సంభవించాయి.

ఆంధ్రప్రదేశ్ లో 2014లో వచ్చిన హుద్ హుద్ తుపాన్ విశాఖ, విజయనగరం జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. ఈ తుపాన్ వలన కైలాస్‌గిరి కొండ పూర్తిగా పాడైంది. వరి పంట నీట మునిగింది. విశాఖలో 18వేలు, విజయనగరంలో 20వేలు కరెంట్ స్థంబాలు నేలకొరిగాయి. బొప్పాయి, అరటి తోటలు పడిపోయాయి. పరిశ్రమలకు వెయ్యి కోట్లు నష్టం జరిగింది. వేలాది ఇళ్లు కూలిపోయాయి. మంచినీటి కోసం ప్రజలు అల్లాడి పోయారు. తల్లీ తుపాన్ శ్రీకాకుళం జిల్లాను అతలాకుతలం చేసింది. ఇప్పుడు మిచౌంగ్ తుపాన్. దేశంలో, రాష్ట్రంలో తుపాన్లు, వరదలు వలన సంభవిస్తున్న నష్టాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర విమర్శలు రావటంతో, తుపాన్లను ఎదుర్కోవడానికి కొన్ని చర్యలు తీసుకుంది. 2009-10లో జాతీయ తుపాన్ ముప్పు ఉపశమన ప్రాజెక్ట్ కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రారంభించి దాన్ని 5సంవత్సరాలు కొనసాగిస్తానని ప్రకటించింది. సముద్రతీర గ్రామాల్లో తుపాన్ షెల్టర్లు నిర్మించింది. తీరప్రాంతంలో పక్కా గృహాలు నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ఈ చర్యల ద్వారా తన ఏజంట్లను ఏర్పాటు చేసుకుంది. ప్రజలను తన చుట్టు తిప్పుకుంది.

సహాయక చర్యల్లో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం- దేశంలోని అనేక రాష్ట్రాల్లో అనేక తుపాన్లు సంభవించాయి. ప్రతి తుపాన్‌లోనూ వేలాదికోట్ల ఆస్థి నష్టం జరుగుతూనే ఉంది. రాష్ట్రాలు తుపాన్ సహాయక చర్యల నిమిత్తం కేంద్రాన్ని సహాయం కోరుతూనే ఉన్నాయి. నష్ట అంచనాకి కేంద్ర బృందాలు నివేదికలు ఇస్తూనే ఉన్నాయి. కేంద్రం మాత్రం రాష్ట్రాలు కోరినదాట్లో పావు వంతు కూడా నిధులు ప్రకటించటంలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు తుపాన్ సందర్భంగా కన్నీటి తుడుపుకు కూడా సరిపోని సహాయంచేసి చేతులు దులుపుకుంటున్నాయి తుపాన్ బాధితులు పడరానిపాట్లు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హుద్ హుద్ తుపాన్‌వల్ల 10 వేల కోట్లు నష్టం జరిగితే, మోదీ ప్రభుత్వం వెయ్యికోట్లు ప్రకటించి 630 కోట్లు మాత్రమే ఇచ్చింది. తన ఖజానా నుండి డబ్బులు తీయకుండా

కేంద్రం ఇచ్చిన నిధులతోనే చంద్రబాబు ప్రభుత్వం సరిపెట్టింది. తిత్లీ తుపాన్ సహాయక చర్యలకు మోదీ ప్రభుత్వం ఎటువంటి సహాయం చేయలేదు. 2021లో భారీ వర్షాల వలన వరదలు సంబంధించి లక్షలాది ఎకరాల్లో పంట నష్టంతో పాటు వేలాదిఇళ్లు కూలిపోయాయి. వేలకోట్లలో నష్టం జరిగింది. సహాయక చర్యలకోసం కేంద్రం నిధుల కేటాయింపు నిరుత్సాహానికి గురిచేసింది. ఇప్పుడు జరిగిన మిచౌంగ్ తుపాన్‌వల్ల పంట నష్టం వేలకోట్లలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 600కోట్ల తక్షణ సహాయం కోరింది. కేద్రంనుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు. జగన్ ప్రభుత్వం కూలిపోయిన ఇండ్లకు తక్షణ సహాయం 10వేలు, పునరావాసం నుంచి వెళ్లేవారికి 2,500 రూపాయలతో పాటు 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు ఇస్తున్నట్లు ప్రకటించింది. పంటనష్ట అంచనాకు తక్షణమే చేపడతామని ప్రకటించింది. ఇది రైతాంగానికి ఏమాత్రం ఊరట కల్పించదు.

రాష్ట్రాల్లో బలమైన తుపాన్ హెచ్చరికల కేంద్రాలు ఉన్నాయని చెప్పుకుంటున్న దేశీయ పాలకులు తుపాన్ల నష్టాలను ఎందుకు తగ్గించలేక పోతున్నారు, ప్రకృతి దయాదాక్షిణ్యాలకే ప్రజలను ఎందుకు వదిలిపెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం తుపాన్లు, భారీ వర్షాల వలన పంటనష్టం, ఆస్థి నష్టం జరుగుతూనే ఉంది. ప్రకృతి వైపరీత్యాలను నివారించటం సాధ్యం కానప్పటికీ నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు. భారీవర్షాలు, వరదల వలన వచ్చే నీటిని నదుల్లో నిల్వచేసే విధంగా ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిర్మించటం, చెరువులకు మళ్లించటం వలన పంట, ఆస్థి నష్టాలను తగ్గించవచ్చు. మడఅడవుల అభివృద్ధి చేయటంద్వారా తుపాన్ ఉధృతితగ్గి నష్టం తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం మాత్రం అలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ప్రాజెక్టులు శంకుస్థాపనలకు, అరకొర పనులకు మాత్రమే రాష్ట్రంలో ప్రాజెక్టులు పరిమితమైనాయి. అనేక గ్రామాల చెరువులు ఆక్రమణకు గురైవాటి రూపం కోల్పోయారు. అనేక పెద్ద చెరువులు పూడికలతో నిండిపోయి ఉన్నాయి. వీటి ఆక్రమణకు బడాబాబులు కుట్ర పన్నుతున్నారు. పాలకులు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేసి ఉంటే, చెరువులను కాపాడి ఉంటే తుపాన్, వరద నష్టాలు చాలా వరకు తగ్గేవి. అందువలన తుపాన్ల వలన సంభవించే భారీ నష్టాలకు పాలకులే కారణం. ప్రస్తుత మిచౌంగ్ భారీ నష్టానికి కూడా రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. మిచాంగ్ తుపాన్ సృష్టించిన బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకుని పంట నష్టపోయిన రైతాంగానికి, గుర్తించిన నష్టం మేర పూర్తి నష్ట పరిహారం ఇవ్వాలని, రెండవ పంటకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని ఎటువంటి ఆక్షలు, నిబంధనలు పెట్టకుండా మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేయాలని, ఇళ్లు కూలిపోయిన వారికి 50వేలు ఉచిత సహాయం అందించాలని, గ్రామీణ, పట్టణ పేదలకు 10వేల ఆర్థిక సహాయం, నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువుల ఇవ్వాలని రైతాంగం, గ్రామీణ, పట్టణ పేదలు సమైక్యంగా ఉద్యమించాలి.

సెల్ : 9885983526

బీజేపీ విజయశాతం ఎక్కువ: ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయశాతం 56గా ఉంటే... కాంగ్రెస్‌ది 18 శాతం మాత్రమేనని ప్రధాని మోదీ వెల్లడించినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎంపీలకు తెలియజేశారన్నారు. మూడు రాష్ట్రాల్లో పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఎంపీలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించినట్లు చెప్పారు. సమావేశం అనంతరం మంత్రి ప్రహ్లాద్ జోషి మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆసక్తికర విషయాన్ని ఎంపీలతో పంచుకున్నారని, వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ 40 సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే కేవలం ఏడుసార్లు మాత్రమే విజయం సాధించిందని చెప్పారన్నారు. బీజేపీ 39 సార్లు పోటీ చేస్తే... 22 సార్లు గెలిచిందని, ప్రాంతీయ పార్టీలు 36 సార్లు పోటీ చేసి 18 విజయాలు నమోదు చేశాయని, కాంగ్రెస్ విజయశాతం 18 కాగా, బీజేపీది 56, ప్రాంతీయ పార్టీలది 50 శాతం. ప్రజలు సుపరిపాలన కోసం బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారనేందుకు ఈ ఫలితాలే నిదర్శనమని మోదీ చెప్పినట్లు ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపీలకు ప్రధాని కీలక సూచన చేశారు. బీజేపీ ఎంపీలంతా తప్పకుండా 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో పాల్గొనాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం పార్టీ కార్యకర్తల సమష్టి కృషి ఫలితమని మోదీ అన్నారు. దీనిని ఎవరి వ్యక్తిగత విజయంగా చెప్పడం సమంజసం కాదని, అందుకే మోదీ విజయమని చెప్పొద్దని ఎంపీలకు సూచించారు. దేశంలో బీజేపీ పాలన మెరుగ్గా ఉండటంతో మూడు రాష్ట్రాల్లో ప్రజలు పార్టీకి పట్టం కట్టారని, తెలంగాణ, మిజోరంలో పార్టీ బలపడిందని ప్రధాని వ్యాఖ్యానించారు. కాగా, బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీకి ఘన స్వాగతం లభించింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు నేపథ్యంలో గురువారం ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. సమావేశ మందిరంలోకి మోదీ ప్రవేశిస్తుండగా సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనుల మధ్య ఆయనకు స్వాగతం పలికారు.

సహజీవనం దురాచారం: బీజేపీ ఎంపీ

న్యూఢిల్లీ: సహజీవనం ఓ అత్యంత ప్రమాదకరమైన జబ్బు అని బీజేపీ ఎంపీ ధరంవీర్‌సింగ్ వ్యాఖ్యానించారు. దాన్ని సమాజం నుంచి నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఓ చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. హరియాణాకు చెందిన ఎంపీ ధరంవీర్ సింగ్ లోక్‌సభ జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతూ ప్రేమ వివాహాల్లో విడాకుల శాతం అధికంగా ఉంటోందని తెలిపారు. తీవ్రమైన ఈ అంశాన్ని ప్రభుత్వం, పార్లమెంటు దృష్టికి తీసుకురావాలని కోరుకుంటున్నానని, వసుదైవ కుటుంబం అనే తత్వానికి భారతీయ సంస్కృతి ప్రసిద్ధి అని, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే మన సామాజిక నిర్మాణం భిన్నమైనదని ధరంవీర్ సింగ్ చెప్పారు. వివాహ బంధం విషయంలో వధూవరుల తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పాశ్చాత్య దేశాల్లో ఇది సాధారణమే అయినప్పటికీ... మనదేశంలో ఈ తరహా బంధాలు పెరుగుతున్నాయన్నారు. వీటి పరిణామాలు మాత్రం అత్యంత భయంకరంగా ఉంటున్నాయని గుర్తుచేశారు. ఈ సందర్భంగా శ్రద్ధా వాకర్-అఫ్తాబ్ పూనావాల కేసును ఆయన ఉదహరించారు. సహజీవనానికి వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని, తద్వారా ఈ ప్రమాదకరమైన వ్యాధిని సమాజం నుంచి నిర్మూలించగలమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఇప్పటికీ పెద్దలు కుదిర్చిన వివాహాలకే అధిక ప్రాధాన్యం ఉందని ధరంవీర్ అభిప్రాయపడ్డారు. అమెరికాలో విడాకుల రేటు 40 శాతంగా ఉంటే భారత్‌లో అది 1.1శాతంగా ఉందని తెలిపారు.

తుపాను బాధితులకు ఆపన్న హస్తం

ఆదుకున్న భారత వైమానిక దళం

చెన్నై: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో వణుకుతున్న చెన్నై నగరానికి భారత వైమానిక దళం ఆపన్నహస్తం అందించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎయిర్ డ్రాప్ 2,300 కిలోల సహాయ సామగ్రిని పంపిణీ చేసింది. ఐఏఎఫ్‌తో కలిసి తమిళనాడు ప్రభుత్వ విపత్తు నిర్వహణ శాఖలు పని చేస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ఏజెన్సీలు సహాయక సామగ్రిని అందిస్తున్నాయి. నాలుగు చేతక్ హెలికాప్టర్లు దక్షిణ చెన్నైలో మెదవాక్కం నుండి పుజుడివాక్కం మెట్రో స్టేషన్ వరకు 8 ప్రదేశాలను కవర్ చేశాయి. ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ చేతక్ హెలికాప్టర్లలో అధికారులు చెన్నైలోని వెస్ట్ తాంబరం, ముడిచూర్, వెలచ్చేరి, పల్లికరణై ప్రాంతాల్లో సహాయక సామగ్రిని పంపిణీ చేశారు. పల్లికరణై, తోరైపాక్కం ప్రాంతాల్లోనూ సహాయక చర్యలు చేపట్టారు. పాలు, నీరు, బ్రెడ్, బిస్కెట్లు, కిరాణా సామగ్రిని ఇస్తున్నట్లు స్థానికులు చెప్పారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. చెన్నై శివార్లు ఇంకా వరద ముంపు ఎదుర్కొంటున్నాయని, ప్రతి ఒక్కరికీ ఆహారం, పాలు వంటి నిత్యావసరాలు అందేలా చూస్తున్నామని, త్వరలో పరిస్థితి మెరుగుపడుతుందని భావిస్తున్నామని సీఎం తన ఎక్స్ హ్యాండిల్ నుంచి పోస్ట్ చేశారు.

కట్నం డిమాండ్‌తో డాక్టర్ ఆత్మహత్య

తిరువనంతపురం: కేరళలో దారుణం జరిగింది. కట్నం కారణంతో వరుడు పెళ్లి రద్దు చేసుకున్నాడని ఓ డాక్టర్ ఆత్మహత్య చేసుకుంది. తిరువనంతపురం మెడికల్ కాలేజీలో పీజీ చదువుతున్న షహానా ఇన్‌స్టిట్యూట్ సమీపంలోని అద్దె అపార్ట్‌మెంట్‌లో శవమై కనిపించింది. పీజీ డాక్టర్ అయిన తన స్నేహితుడు పెళ్లి ప్రస్తావన నుంచి విరమించుకోవడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు ఆరోపించారు. షహానా(26) తిరువనంతపురంలో డాక్టర్ పీజీ కోర్సు చదువుతోంది. ఈ క్రమంలో తన స్నేహితుడితో పెళ్లి సంబంధం కుదిరింది. కానీ పెళ్లి కొడుకు తరుపువారు భారీస్థాయిలో కట్నం అడిగారు. కానీ షహానా అంతమొత్తంలో కట్నం చెల్లించుకోలేకపోయింది. దీంతో పెళ్లి ప్రతిపాదనను వరుడు విరమించుకున్నాడు. ఆ తర్వాత షహానా తన ఫ్లాట్‌లో ఆత్మహత్య చేసుకుంది. షహానా కుటుంబాన్ని పరామర్శించిన కేరళ మహిళా కమిషన్ చైర్‌పర్సన్, అడ్వకేట్ సతీదేవి... ఈ అంశంపై సరైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్‌ను మెడికల్ పీజీ డాక్టర్స్ అసోసియేషన్ అన్ని బాధ్యతల నుంచి తొలగించింది. తిరువనంతపురం మెడికల్ కాలేజీలో మహిళా పీజీ డాక్టర్ ఆత్మహత్యపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్... మహిళా శిశు అభివృద్ధి శాఖను ఆదేశించారు. వరకట్నం డిమాండ్ల కారణంగానే డాక్టర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

ఒడిశా వైద్య సిబ్బందిపై ఎస్మా

భువనేశ్వర్: వైద్యశాఖ సిబ్బంది సమ్మెపై నిషేధం విధిస్తూ బుధవారం అర్ధరాత్రి ఒడిశా ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించింది. పారామెడికల్ సిబ్బంది సహా నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, క్లాస్ 3, 4 ఉద్యోగుల సమ్మెపై నిషేధం విధించేందుకు నిత్యావసర సర్వీసుల (నిర్వహణ) యాక్ట్(ఎస్మా) విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఉత్తర్వులు ఆరు నెలల పాటు అమలులో ఉంటాయని ఆరోగ్య శాఖ తెలిపింది. పేద ప్రజలకు, అత్యవసర రోగులకు అంతరాయం లేకుండా నిరంతరాయం వైద్యసేవలు అందించేందుకు రాష్ట్రంలోని వైద్య సేవలకు సంబంధించిన ఉద్యోగుల(కాంట్రాక్ట్ ఉద్యోగులు సహా) సమ్మెపై నిషేధం విధిస్తున్నట్లు ఆరోగ్య శాఖ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక వైద్య సైవా కేంద్రాలు, ప్రభుత్వ గ్రాంట్లతో నిర్వహించే మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు సహా ప్రభుత్వ గ్రాంట్లతో నడిచే హెల్త్ ఇన్‌స్టిట్యూషన్లలో పనిచేసే సిబ్బందికి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మునిసిపల్ ఆస్పత్రులు, ఈఎస్ఐ, కటక్‌లోని ఆచార్య హరిహర్ రీజనల్ క్యాన్సర్ సెంటర్, ప్రాంతీయ వెన్నెముక ఆస్పత్రులతో పాటు జైళ్లు, పోలీస్ ఆస్పత్రుల సిబ్బంది కూడా నిషేధపు ఉత్తర్వుల పరిధిలోకి వస్తారని ప్రకటించింది.

వివాదాలతోనే హత్యలు

- దేశంలో 28,522 కేసుల నమోదు
- కారణాలు వెల్లడించిన ఎన్‌సీఆర్‌బీ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో జరుగుతున్న హత్యల వెనుక అత్యంత సాధారణ కారణాలను జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది దేశంలో 28,522 హత్య కేసులు నమోదుకాగా రోజువారీ సగటు 78గా ఉన్నట్లు తెలిపింది. 2020, 2021 సంవత్సరాలతో పోల్చితే హత్య కేసులు తగ్గడం కాస్త ఊరట కలిగించే అంశం. క్రైమ్ ఇన్ ఇండియా 2022 నివేదిక ప్రకారం... 2021లో 29,272, 2020లో 29,193 కేసులు నమోదయ్యాయి. దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంది. గతేడాది అక్కడ 3,491 ఎఫ్ఐఆర్‌లు నమోదుకాగా, తర్వాత స్థానాల్లో బీహార్ (2,930), మహారాష్ట్ర (2,295), మధ్యప్రదేశ్ (1,978), రాజస్థాన్ (1,834), పశ్చిమ బెంగాల్ (1,696) నిలిచాయి. అత్యల్పంగా సిక్కింలో 9, నాగాలాండ్ 21, మిజోరం 31, గోవా 44, మణిపూర్‌లో 47 కేసులు నమోదయ్యాయి. కేంద్రపాలిత ప్రాంతాల విషయానికి వస్తే ఢిల్లీలో 509 హత్య కేసులు నమోదుకాగా... జమ్ము కశ్మీర్ (99), పుదుచ్చేరి (30), చండీగఢ్ (18), దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ (16), అండమాన్ నికోబార్ దీవులు (7), లడఖ్ (5), ఉన్నాయి. హత్యకు గురైనవారిలో 95.4 శాతం మంది 20 దాటిన పెద్దవాళ్లే. మొత్తం బాధితుల్లో 8,125 మంది మహిళలు కాగా, పురుషులు 70 శాతం మంది ఉన్నారు. గతేడాది హత్యకు గురైన వారిలో తొమ్మిది మంది థర్డ్ జెండర్లు కూడా ఉన్నారు. 2022లో అత్యధిక హత్య కేసుల్లో 9,962 కేసులతో 'వివాదాలే' కారణమని డేటా వెల్లడించింది. మహారాష్ట్రలో అత్యధికంగా 1,130 కేసులు కాగా... తర్వాత స్థానాల్లో తమిళనాడు (1,045), బీహార్ (980), మధ్యప్రదేశ్ (726), ఉత్తరప్రదేశ్ (710) వివాదాల కేసులు నమోదయ్యాయి. గతేడాది వివాదాల తర్వాత 'వ్యక్తిగత పగ లేదా శత్రుత్వం' కారణంగా జరిగిన హత్య కేసులు (3,761) ఉన్నాయి. ఈ జాబితాలో బీహార్ (804), మధ్యప్రదేశ్ (364), కర్నాటక (353) అగ్రస్థానంలో నిలిచాయి. వరకట్నం, క్షుద్రపూజలు, నరబలి, మత, కులతత్వం, రాజకీయ కారణాలు, వర్గ వైరుధ్యం, పరువు హత్య, ప్రేమ వ్యవహారాలు ఇతర ఉద్దేశాలు ఉన్నాయి. కుటుంబ వివాదాలు, అక్రమ సంబంధాలు, తీవ్రవాదం/ తిరుగుబాటు, దోపిడీలు, ముఠా వైరం, ఆస్తి/ భూమి తగాదాలు, చిన్న చిన్న తగాదాలు కూడా 2022లో హత్యలకు దారితీశాయి. ప్రధాన నగరాల విషయానికి వస్తే అత్యధిక హత్యలతో ఢిల్లీ అగ్రస్థానంలో ఉండగా... తర్వాత ముంబై నిలిచింది. సురక్షిత నగరాల్లో కోల్‌కతా, పూనె, హైదరాబాద్ నిలిచాయి.

న్యాయం వైపు నిలుద్దాం

ఇజ్రాయిల్ మారణకాండను ఖండించిన ప్రియాంకగాంధీ

న్యూఢిల్లీ: గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నేత ప్రియాంక గాంధీ గురువారం ఖండించారు. భారత్ న్యాయం వైపు నిలబడాలని ఆమె మోదీ ప్రభుత్వానికి సూచించారు. గాజాపై ఇజ్రాయిల్ కనికరం లేని బాంబు దాడి...సంధికి ముందు కంటే మరింత క్రూరత్వంతో విరుచుకుపడుతోందని అన్నారు. న్యాయం వైపు నిలబడటం, సాధ్యమైనంత త్వరగా కాల్పుల విరమణను ప్రకటించేలా చర్యలు చేపట్టడం అంతర్జాతీయ సమాజంలో సభ్యునిగా ఉన్న భారత దేశం కనీస విధి అని స్పష్టం చేశారు. భారత్ ఎప్పుడూ న్యాయం కోసం నిలబడిందని, పలస్తీనా చేపడుతున్న సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాటానికి ప్రారంభం నుండి మద్దతు ఇచ్చిందని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఒప్పందం ముందు కంటే ఇజ్రాయిల్ మరింత క్రూరంగా విరుచుకుపడుతోందని విమర్శించారు. వైద్య సదుపాయాలను ధ్వంసం చేసిందని, ఆహారంతో పాటు కనీస సౌకర్యాలు అందకుండా అడ్డుకుంటోందని మండిపడ్డారు. పలస్తీనా మొత్తం తుడిచిపెట్టుకుపోతోందని ప్రియాంక గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 10 వేల మంది చిన్నారులు, 60కిపైగా జర్నలిస్టులు, వందలాది మంది వైద్య సిబ్బంది సహా 16 వేల మంది అమాయక పౌరులను చంపేశారని గుర్తుచేశారు. వారు కూడా మనందరిలాగే కలలు, ఆశలు కలిగిన వ్యక్తులని, మన కళ్లముందే నిర్దాక్షిణ్యంగా హత్యకు గురవుతున్నారని, మన మానవత్వం ఎక్కడుందని ప్రశ్నించారు. దక్షిణాఫ్రికాలోని వర్ణవివక్ష పాలనకు వ్యతిరేకంగా మనం వారి ఆంక్షల కోసం పోరాడామని, పలస్తీనాలోని మన సోదరులు, సోదరీమణులు చేస్తున్న స్వాతంత్ర్య పోరాటానికి ప్రారంభం నుండి మద్దతిస్తున్నామన్నారు.. ప్రస్తుతం పలస్తీనా భూమిపై నుండి వారిని తుడిచిపెట్టేందుకు మారణహోమం జరుగుతున్నా ఏమీ చేయలేకపోతున్నామని ప్రియాంక గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోసం అంతర్జాతీయ వేదికపై నిలబడటం భారత్ కర్తవ్యమని ప్రియాంక పునరుద్ఘాటించారు.

బడ్జెట్‌లో అద్భుతాలకు తావు లేదు: నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: సార్వత్రిక సమరానికి సెమీ ఫైనల్స్‌గా భావించే ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు ఆరు మాసాల గడువు ఉన్నది. వరుసగా మూడోసారి అధికారం చేపట్టాలని చూస్తున్న మోదీ సర్కారు... ఎన్నికలకు ముందు జనాకర్షక పథకాలు, తాయిలాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు బడ్జెట్‌లో కీలక ప్రకటనలు చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో అలాంటి అద్భుత ప్రకటనలు ఏవీ ఉండకపోవచ్చని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచనప్రాయంగా చెప్పారు. సీఐఐ అధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ ఎకనమిక్ పాలసీ ఫోరమ్ సదస్సులో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ఎన్నికల సమయం కావడంతో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టేది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమేనని, ప్రభుత్వ ఖర్చుల కోసం మాత్రమే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నామని చెప్పారు. కాబట్టి ఈ సారి బడ్జెట్‌లో అద్భుతమైన ప్రకటనలు ఉండకపోవచ్చని ఆర్థిక మంత్రి చెప్పారు. కీలక ప్రకటనల కోసం కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రవేశపెట్టే బడ్జెట్ వరకు వేచి చూడాలన్నారు. సాధారణంగా ఏటా ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతుంటుంది. 2024 వేసవిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడతారు.

భూకక్ష్యలోకి ప్రొపల్షన్ మాడ్యూల్

ఇస్రోకి ప్రధాని మోదీ అభినందనలు

న్యూఢిల్లీ: చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనలే ధ్యేయంగా భారత్ ప్రవేశపెట్టిన చంద్రయాన్-3 విషయంలో ఇస్రో మరో రికార్డు సృష్టించింది. చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ప్రొపల్షన్ మాడ్యూల్‌ని విజయవంతంగా మళ్లీ భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఈ ప్రయోగాన్ని మొదట అనుకోలేదని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. చంద్రుడి ఉపరితలంపై ప్రయోగాల కోసం పంపిన ఈ మూన్ మిషన్ తాజా రికార్డు మరింత లోతుగా ప్రయోగాలు చేయడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. జాబిల్లిపై నమూనాలు సేకరించి అక్కడ నుంచి తిరిగి వచ్చే మిషన్ కోసం ప్రణాళికలు రూపొందించేందుకు ప్రొపల్షన్ మాడ్యూల్లోని అదనపు సమాచారం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఈ ఏడాది జులై 14న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి చంద్రయాన్-3 మిషన్‌ను ఇస్రో ప్రయోగించింది. అది విజయవంతం కావడంతో ప్రొపల్షన్ మాడ్యుల్, ల్యాండింగ్ మాడ్యుల్ వేరయ్యాయి. ఆగస్టు 23న జాబిల్లిపై ల్యాండర్ విజయవంతంగా దిగింది. ల్యాండింగ్ మాడ్యుల్‌లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ 15 రోజులు పరిశోధనలు కొనసాగించి తరువాత నిద్రాణ స్థితిలోకి చేరుకున్నాయి.

ఇస్రోకి ప్రధాని ప్రశంసలు

చంద్రయాన్-3 తాజా విజయం పట్ల ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇస్రో శాస్త్రవేత్తలు తాజాగా మరో మైలురాయిని చేరుకోవడం అభినందించదగిన విషయమని పేర్కొన్నారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో మరో సాంకేతిక మైలురాయిని అందుకుందన్నారు. 2040 నాటికి చంద్రుడిపైకి మనుషులను పంపాలనే లక్ష్యంతో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఇండియా కూటమిపై జేడీయూ నేత అనుచిత వ్యాఖ్యలు

పాట్నా: ప్రతిపక్ష ఇండియా కూటమిపై జేడీయూ నేత సునీల్ కుమార్ పింటు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ కూటమిలోని పార్టీల ఐక్యతను ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా పార్టీల మధ్య విభేదాలను ఎత్తిచూపారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఇండియా కూటమి సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే. దీనిపై సునీల్ కుమార్ స్పందిస్తూ పార్టీల మధ్య సీట్ల పంపిణీ విషయంలో అవగాహన రానంత వరకు అది చాయ్-సమోసా మీటింగ్ మాత్రమే అవుతుందని వ్యాఖ్యానించారు. అదేసమయంలో ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని వాస్తవాలు మాత్రమే చెబుతారని, అందుకే ప్రజలు ఆయనను విశ్వసిస్తున్నారని చెప్పుకొచ్చారు. గతేడాది బీజేపీతో తెగతెంపులు చేసుకున్న జేడీయూ ఎన్డీయే కూటమి నుంచి బయటకొచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ సమయంలో బీజేపీనే తనని జేడీయూలోకి పంపిందని సునీల్ తెలిపారు.

తాను ఇప్పటికీ బీజేపీ మనిషినని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జేడీయూతో కొనసాగలేనని, ఆ పార్టీ గుర్తుపై పోటీ చేయడం తనకు ఇష్టం లేదన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కోరిన వెంటనే తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

సవాళ్లు అధిగమించడానికి సరికొత్త సాంకేతికత అవసరం: సీడీఎస్

న్యూఢిల్లీ: భవిష్యత్ భద్రతా సవాళ్లు ఎదుర్కొనేందుకు మానవ సహిత, మానవ రహిత సైనిక బలాలను అనుసంధానించడం చాలా కీలకమని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. ఆ దిశగా భారత్ గట్టి ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) అధ్వర్యంలో ఢిల్లీలో గురువారం నిర్వహించిన 'ఏవియానిక్స్ ఎక్స్‌పో 2023' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టే పరిస్థితులు ఎదురైతే...వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పటిష్ఠమైన రక్షణ రంగ సాంకేతికతను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

భారత సైనిక బలగాల సన్నద్ధతను పెంచడంలో ప్రభుత్వ అధ్వర్యంలో నడుస్తున్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సంస్థ ముందంజలో ఉందని సీడీఎస్ కొనియాడారు. సరికొత్త సాంకేతికతతో వైమానిక రక్షణ పరికరాలను సైన్యానికి అందిస్తోందని చెప్పారు. మానవజాతి మొత్తం మార్పు, పరివర్తనల మధ్యనే నడుస్తోందని చెప్పిన ఆయన... కేవలం భౌగోళిక రాజకీయ స్వరూపమే కాకుండా భౌగోళిక, ఆర్థిక, సాంకేతికత కూడా మనల్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. మిలటరీ బలగాలు పోరాటానికి సంసిద్ధంగా ఉండాలని, అదే సమయంలో భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలు తలెత్తవచ్చన్న దానిపై అవగాహన ఉండాలన్నారు. దీనికోసం మానవ సహిత, రహిత సైనిక సంపత్తిని అనుసంధానించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.

చత్తీస్‌గఢ్‌లో 17 మంది ఎమ్మెల్యేలపై కేసులు

33 మంది విద్యార్హత 12వ తరగతే

రాయ్‌పూర్ : చత్తీస్‌గఢ్ రాష్ట్ర శాసనసభకు కొత్తగా ఎన్నికయిన 90 మంది ఎమ్మెల్యేకుగాను 17 మందికి పైగా తమపై నేర కేసులు ఉన్నాయని ధ్రువీకరించారు. వీరిలో ఆరుగురు దాడి చేసి గాయపరచడం, బెదిరించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 54 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ పార్టీ 2018లో 68 సీట్లలో విజయం సాధించగా, ప్రస్తుతం 35కే పరిమితమైంది. అయితే గోండ్వానా గణతంత్ర పార్టీ (జీజీపీ) ఒక నియోజకవర్గంలో గెలుపొందింది. ఇక దివంగత ముఖ్యమంత్రి అజిత్ జోగి స్థాపించిన జనతా కాంగ్రెస్ చత్తీస్‌గఢ్ (జే), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) ఈసారి తమ ఖాతా తెరవడంలో విఫలమయ్యాయి. చత్తీస్‌గఢ్ ఎలక్షన్ వాచ్ అండ్ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మర్స్ (ఏడీఆర్) నివేదిక ప్రకారం, కొత్తగా ఎన్నికయిన 90 మంది ఎమ్మెల్యేలలో 17 (దాదాపు 19 శాతం) మంది తమపై నేర కేసులు ఉన్నట్లు తమ ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్నారు. వారిలో ఆరుగురు (7 శాతం) ఎమ్మెల్యేలు తీవ్ర నేర కేసులు ఎదుర్కొంటున్నట్లు ధ్రువీకరించారని అది తెలిపింది. అయితే బీజేపీకి చెందిన 54 మంది ఎమ్మెల్యేలలో 12 (22 శాతం) మంది, కాంగ్రెస్‌కు చెందిన 35 మంది ఎమ్మెల్యేలలో ఐదుగురు (14 శాతం) తాము నేర కేసులు ఎదుర్కొంటున్నట్లు ప్రకటించుకున్నారు. అదేవిధంగా, బీజేపీలో నలుగురు (7 శాతం) ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌లో ఇద్దరు (6 శాతం) తమపై తీవ్ర నేర కేసులు ఉన్నాయని ధ్రువీకరించారు. నివేదిక ప్రకారం, కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన పదవీ విరమణ చేసిన ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ (పటన్ సీటు), దేవేంద్ర యాదవ్ (భిలాయ్ నగర్), అతల్ శ్రీవాత్సవ్ (కోట) నేర కేసులు ఎదుర్కొంటున్నారు. నేర కేసులు ఎదుర్కొంటున్న బీజేపీ నుంచి కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలో మాజీ మంత్రులు రాజేష్ మునాత్ (రాయ్‌పూర్ నగరం పశ్చిమం), దయాల్‌దాస్ బాఘేల్ (నవగఢ్), శకుంతలా సింగ్ పోర్టే (ప్రతాపూర్), ఉద్దేశ్వరి పైక్రా (సమ్రి), ఓపీ చౌదరి (రాయ్‌గఢ్), విజయ్ శర్మ (కవార్ధా సీటు), వినాయక్ గోయల్ (చిత్రకోట్-ఎస్టీ), ఆశారాం నేతమ్ (కంకేర్-ఎస్టీ) ఉన్నారు. కాగా, 2018లో ఎన్నికయిన 90 మంది ఎమ్మెల్యేలకుగాను 24 (27 శాతం) మంది తమపై నేర కేసులను ధ్రువీకరించుకున్నారు. వారిలో 13 (14 శాతం) మంది తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

72 మంది కోటీశ్వరులే... బీజేపీయే ప్రథమం

రాష్ట్ర శాసనసభకు కొత్తగా ఎన్నికయిన 90 మంది ఎమ్మెల్యేలలో 72 మందికి పైగా కోటీశ్వరులేనని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. గత విధానసభతో పోలిస్తే నలుగురు ఎక్కువ. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీజేపీ 43 మంది కోటీశ్వరులతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, కాంగ్రెస్ తర్వాతి స్థానంలో ఉంది. కొత్తగా ఎన్నికయిన మొత్తం 72 మంది ఎమ్మెల్యేలు (సభలో 80 శాతం మంది) కోటీశ్వరులే. 54 మంది ఎమ్మెల్యేలలో 43 (80 శాతం) మంది ఒక్కొక్కరు రూ.1 కోటి కంటే ఎక్కువ ఆస్తులను ప్రకటించిన జాబితాలో బీజేపీ అగ్రస్థానంలో ఉంది. 29 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 83 శాతం మంది కోటీశ్వరులు. 2018 అసెంబ్లీ ఎన్నికలలో రూ.11.63 కోట్లతో పోలిస్తే ఈసారి జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి సగటు ఆస్తులు రూ.5.25 కోట్లు. చంద్రాపూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్‌కుమార్ యాదవ్, ఆయన బీజేపీ సహచరులు రామ్‌కుమార్ టోప్పో, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రస్తుత ఎంపీ గోమతి సాయి అత్యల్ప ఆస్తులున్న ఎమ్మెల్యేల జాబితాలో అట్టడుగున ఉన్నారు. విశ్లేషణ ప్రకారం యాదవ్ ఆస్తుల విలువ రూ.10 లక్షలు, మొత్తం ఎమ్మెల్యేలలో అత్యల్పంగా టోప్పో రూ.13.12 లక్షలు, సాయి రూ.15.47 లక్షలుగా ప్రకటించారు. 90 మంది ఎమ్మెల్యేలలో 33 మంది (37 శాతం) 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉత్తీర్ణులయ్యారని తమ విద్యార్హత ప్రకటించారని నివేదిక పేర్కొంది. మొత్తం 54 మంది ఎమ్మెల్యేలలో గరిష్ఠంగా 60 శాతం మంది గ్రాడ్యుయేట్ డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువ అర్హతలు కలిగి ఉన్నారు. మరో ఇద్దరు డిప్లొమాలు కలిగి ఉండగా, ఒక ఎమ్మెల్యే తనను తాను కేవలం 'అక్షరాస్యుడు' అని ప్రకటించుకున్నారు.

ప్రభుత్వ సాయం అందేలా చూస్తాం

పంటలు కోల్పోయిన రైతాంగానికి సీపీఐ భరోసా

విశాలాంధ్ర నెట్‌వర్క్: మిచౌంగ్ తుపానుకు చేతికొచ్చిన పంటలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సాయమందించాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. గురువారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తుపానుకు దెబ్బతిన్న వరి, మిరప, మొక్కజొన్న, పొగాకు, మినుము, అరటి పంటల్ని పార్టీ నాయకులు పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయమందేలా చూస్తామని, అవసరమైతే ఉద్యమిస్తామని భరోసా ఇచ్చారు.

కౌలు రైతులకు పరిహారం ఇవ్వాలి: జల్లి విల్సన్

బాపట్ల: సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ గురువారం పార్టీ నాయకులతో కలిసి బాపట్ల జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో నీట మునిగిన వరి, మిరప, మొక్కజొన్న, పొగాకు, మినుము పంటలను పరిశీలించారు. పర్చూరు నియోజకవర్గం వీరన్నపాలెంలో వరద నీటికి పూర్తిగా మునిగిన పొగాకు, మిర్చి, శనగ పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీరన్నపాలెంలో పేద కౌలు రైతులు ఎకరాకు రూ. 30 వేలు భూ యజమానులకు సాగుకు ముందే చెల్లించి సాగు చేపట్టారన్నారు. కౌలు రూ.30 వేలతో పాటు మరో రూ.30 వేలు కలిపి ఇప్పటివరకు ఎకరాకు మొత్తం రూ.60వేలు ఖర్చుచేశారన్నారు. వీరన్నపాలెంలో సుమారు 4500 ఎకరాల మేర పంట పూర్తిగా నీటమునిగిందన్నారు. ప్రభుత్వం చెల్లించే ఆర్థిక సాయాన్ని కౌలు రైతులకే నేరుగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు ఏ షరతులు లేకుండా రద్దు చేయాలని, భవిష్యత్తులో పంటలు వేసుకునేందుకు అన్ని విధాలుగా సాయం అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ప్రభుత్వాలు ఆర్థిక సాయం చేస్తేగాని గ్రామీణ పేద రైతులు, కూలీలు, తుపాను నష్టం నుంచి కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు, ఎరువులు కూడా ఇచ్చి వ్యవసాయాన్ని, రైతాంగాన్ని ప్రభుత్వం పోత్సహించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినట్లుగా రైతులను ఆదుకుని వాగ్దానాలను నిలబెట్టుకోవాలని జల్లి విల్సన్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు జల్ది భాగ్య శ్రీధర్, బత్తుల శ్యామ్యూల్, నాయకులు అచ్చుతిని బాబూరావు, సీపీఐ చీరాల మండల కార్యదర్శి కోలా వీరాంజనేయులు, కౌలు రైతులు ఆర్.అబ్రహం, సాధు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



జాతీయ విపత్తుగా గుర్తించి సహాయమందించాలి: కోటేశ్వరరావు

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు గురువారం సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయక కార్యదర్శి బుడ్డి రమేష్, సీపీఐ మైలవరం నియోజకవర్గం నాయకులు కన్నా వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు బీ వెంకట రత్తయ్య, యువజన సమాఖ్య నాయకులు పీ వెంకటేశ్వరరావు, వెంకట సుబ్బారావులతో కలిసి మైలవరం నియోజకవర్గం కవులూరు, చుట్టుపక్కల పొలాలను పరిశీలించి రైతులను పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులతోపాటు మోకాళ్ల లోతు నీటిలో దిగి మునిగిపోయిన వరి కంకులను చూసి నివ్వెరపోయారు. అనంతరం జి.కొండూరులో బుడ్డి రమేష్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పంట నష్టం జరిగిన తీరును వివరించారు. గత మూడు నాలుగు రోజులుగా నీటిలో మునిగి ఉండటంతో కంకులతో ఉన్న ఒడ్లు నాని మొలకెత్తాయన్నారు. ఒక్క కవులూరులోనే సుమారు 3వేల ఎకరాలకు పైగా వరి పంట వేశారని 200 ఎకరాలకు పైగా మిర్చి పంట వేశారని... కోతలు ప్రారంభమైన దశలో తుపాను పంటలను ముంచేసిందన్నారు. తూటికాళ్లతో డ్రెన్లు నిండిపోవడంతో నీటిపారుదల లేక నీళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని దీనివలన మరింత నష్టం జరిగిందని రైతులు తమ దృష్టికి తెచ్చారన్నారు. డ్రెన్లకు మరమ్మత్తులపై అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ఎకరానికి 30 వేల నుండి 50 వేల వరకు ఖర్చుపెట్టి శ్రమించి సాగు చేసిన పంట కోత దశలో తుపాను మింగేసిందన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తుపాను నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సహాయక చర్యలు చేపట్టాలని... ముఖ్యంగా పంటలు నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారాన్ని అందించాలని, రబీ సీజన్‌కు ఆర్థిక సహాయం చేకూర్చాలని అలాగే ఉపాధి పనులను ప్రారంభించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. నివాసాలు కోల్పోయిన వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

పంట రుణాలను మాఫీ చేయాలి: దోనేపూడి శంకర్

గంపలగూడెం: సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ గురువారం గంపలగూడెం మండలంలోని ఊటుకూరు, దెందురాలపాడు మేడూరు సుబ్బాల తదితర గ్రామాలలో తుపాను వర్షాలకు నీట మునిగిన వరి, మిరప, పత్తి తదితర పంటలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వరి కోత దశలో పూర్తిగా నేలమట్టమై నీళ్లలో నాని పోతోందని, కాయ దశలో ఉన్న మిరప చేలు నేలకొరిగి పోయాయన్నారు. వర్షం, ఈదురుగాలికి ప్రతి పంట సర్వ నాశనమైందన్నారు. ప్రభుత్వం నిబంధన లను సడలించి తడిసిన వరి ధాన్యాన్ని, నల్లబడ్డ పత్తిని కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను వెంటనే మంజూరు చేయాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలని ప్రభుత్వానికి సూచించారు. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి పంటకు రూ.60వేలు, మిరపకు రూ. లక్ష వంతున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, జిల్లా రైతు సంఘం నాయకులు మలినీడి యలమందరావు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకూరు వెంకటేశ్వరరావు, సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, విసన్నపేట మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు ఎ కొండూరు మండల కార్యదర్శి మేకల దేవిడ్, రైతు సంఘం తిరువూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నృసింహాద్రి వనమాలి, మండల సహాయ కార్యదర్శి గౌర్రాజు, రామకృష్ణ, సీపీఐ సీనియర్ నాయకులు సిద్ధి వైకుంఠరావు, వ్యవసాయ కార్మి క సంఘం నాయకులు పైడిపల్లి రవి, రైతు సంఘం నాయకులు భీమిశెట్టి జ్ఞాన రాజు, సిద్ధి కృష్ణారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

2024లో 12 అంతరిక్ష యాత్రలు

- కీలక ప్రయోగాలకు ఇస్రో సన్నాహాలు
- నింగిలోకి ఆరు పీఎస్ఎల్వీ, మూడు జీఎస్ఎల్‌వీలు
- రాజ్యసభలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది వరుస ప్రయోగాలకు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) సన్నాహాలు చేస్తోంది. వరుస విజయాలతో దూసుకెళుతున్న ఇస్రో వచ్చే ఏడాది 12 మిషన్‌లను చేపట్టాలని భావిస్తోంది. ఇందులో కీలకమైన ఆరు పీఎస్ఎల్వీ, మూడు జీఎస్ఎల్వీ ప్రయోగాలు ఉన్నాయి. లాంచ్ వెహికల్ మార్క్-3 (ఎల్‌వీఎం3)ని కూడా ఇస్రో ప్రయోగించనున్నది. కొత్త ప్రయోగ వాహక నౌక 'ఎస్ఎస్ఎల్వీ' (స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్) ద్వారా సాంకేతికాధారిత ఉపగ్రహాన్ని ప్రయోగించాలని భావిస్తోంది. రెండు మానవ రహిత మిషన్‌లను గగన్‌యాన్‌లో భాగంగా చేపట్టాలని యోచిస్తోంది. ఈ మేరకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభకు రాతపూర్వకంగా తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో గగన్‌యాన్‌లోని వ్యోమగాములు సురక్షితంగా బయటపడేలా అభివృద్ధి చేసిన 'క్రూ ఎస్కేప్ సిస్టమ్'ను ధ్రువీకరించేందుకు మరో ప్రయోగాన్ని ఇస్రో చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. పీఎస్ఎల్వీ ద్వారా జరిగే ఆరు ప్రయోగాల్లో అంతరిక్ష పరిశోధన, భూ పరిశీలన ఉపగ్రహాలతో పాటు సాంకేతిక, వాణిజ్య ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపనున్నారు. అలాగే వాతావరణ శాస్త్ర ఉపగ్రహం, నేవిగేషన్ శాటిలైట్‌తో పాటు నాసా-ఇస్రో సంయుక్త అధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న సింథటిక్ అపెర్చర్ రేడార్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించాలని ఇస్రో సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రెండు పునర్వినియోగ వాహక నౌకల ప్రయోగాలకు అంతరిక్ష పరిశోధన కేంద్రం సమాయాత్తమవుతోందన్నారు. న్యూస్పేస్ ఇండియా లిమిటెట్ (ఎన్ఎస్ఐఎల్)తో ఒప్పందం ప్రకారం జీశాట్ 20 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ఇస్రో ప్రవేశపెట్టనుందని జితేంద్ర సింగ్ వెల్లడించారు.

రేపు విజయవాడలో సీపీఐ రౌండ్‌టేబుల్

విశాలాంధ్ర-విజయవాడ: కరువు, తుపాన్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులు, వ్యవసాయ కార్మికులు, వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ శనివారం విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. సమావేశానికి వివిధ రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపాయి. మిచౌంగ్ తుపాను రాష్ట్రంలో బీభత్సం సృష్టించిందని, లక్షలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నాయి. వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఇళ్లు, ఆస్తులు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. శ్రీకాకుళం నుండి చిత్తూరు జిల్లా వరకు దాదాపు అన్ని జిల్లాల్లోనూ భారీ ఎత్తున పంట నష్టం జరిగిందని వివరించాయి. పంట నష్టాలను అంచనా వేయించి రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో 18 జిల్లాల్లోని 440 మండలాల్లో తీవ్రమైన కరువు తాండవించిందని తెలిపాయి. కరువు కారణంగా మెట్ట ప్రాంత రైతులు లక్షలాది ఎకరాల్లో పంటలు వేయలేదన్నారు. అప్పులు తెచ్చి పెట్టిన పంటలు ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాయి. అటు మెట్ట ప్రాంత రైతులు కరువుతోనూ, ఆయకట్టు ప్రాంత రైతులు తుపానుతోను తీవ్ర ఇక్కట్ల పాలయ్యారని, ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాయి.

ఉత్తరాంధ్రలో వలసలు ఆగాలి

స్టీల్ ప్లాంట్‌పై జగన్ నోరు మెదరపరేం?: పవన్ కల్యాణ్



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి యువత ఉపాధి కోసం వలసలు పోయే పరిస్థితి పోవాలని అందుకు జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి విశాఖలోని ఎంపీ కాలనీ ఏఎస్ రాజా కాలేజీ గ్రౌండ్స్ లో జనసేన నిర్వహించిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఉత్తరాంధ్ర పై ఇప్పుడే ప్రేమ కారిపోతోందా అని ప్రశ్నించారు. ఇక్కడున్న వనరులను తన వర్గానికి దోచిపెట్టడమే లక్ష్యంగా ఆయన విశాఖ వస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రలో పరిశ్రమలు నెలకొల్పాలని, ప్రతి 30 కిలోమీటర్లకు మత్స్యకారులకు జట్టి నిర్మించాలని, అది జనసేన సారథ్యంలో వచ్చే ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై జగన్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బలిదానాలతో ఏర్పాటు చేసుకున్న స్టీల్ ప్లాంట్ ను రాజకీయ లబ్ధిగా చూస్తున్నారే తప్ప ఈ ప్రాంత ప్రజల జీవనాడిగా చూడడం లేదన్నారు. తనకు ఒక్క ఎంపీ ఉన్నా స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు సాధించేవాడినని పవన్ చెప్పారు. వైసీపీకి 35 మంది ఎంపీలు ఉన్నా కూడా రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చలేక పోతున్నారని, కేవలం వారి కేసుల నుంచి బయట పడ్డానికే కేంద్రంతో రాజీ పడుతున్నారని పవన్ ఎద్దేవా చేశారు. ఏపీ భవిష్యత్తు బాగుండాలంటే రాష్ట్రంలో జనసేన-టీడీపీతో పొత్తు ఉండాలన్నారు. మనం టీడీపీ వెంట నడవడం లేదని, కలిసి నడుస్తున్నామని జనసేన కార్యకర్తలకు స్పష్టం చేశారు. జనసేనపై గుండెల్లో ఉన్న అభిమానం ఓట్ల రూపంలో చూపించాలని అప్పుడే జనసేనకు గుర్తింపు లభిస్తుందన్నారు.

సీఎం జగన్ నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పోరాటం అన్ని జిల్లాలను ఏకం చేసిందని, విశాఖ ఉక్కు అంశం భావోద్వేగంతో కూడిందని పవన్ అన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర పెద్దలకు చెప్పానన్నారు. విశాఖ ఉక్కుపై తన అభిప్రాయాన్ని అమిత్ షా గౌరవించారని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ప్రయత్నం చేయగలిగామన్నారు. యువత కోసమే తన ఆలోచన అంతా అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో జగన్ ఘోరంగా ఓడిపోతారని, మార్పు స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఏపీలో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తపర్చారు. ఈ ప్రభుత్వం పోలీసులను సమర్థంగా వినియోగించడం లేదని, టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తే పోలీసు శాఖకు పూర్వవైభవం తీసుకొస్తామని పవన్ అన్నారు. ఈ సభలో జనసేన నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు లోక్‌సభకు మొయిత్రా వివాదం

న్యూఢిల్లీ: డబ్బుకు ప్రశ్నల వ్యవహారంలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై పార్లమెంటరీ నైతిక కమిటీ నివేదిక శుక్రవారం లోక్‌సభ ఎదుటకు రానున్నది. ఈ నివేదికను సమర్పించే క్రమంలో మొయిత్రాపై వేటునకు కమిటీ సిఫార్సు చేస్తుంది. ఈ నివేదికపై ఓటింగ్ నిర్వహించాలని ప్రతిపక్షం కోరే అవకాశం ఉంది. దీని కోసం బీజేపీ సిద్ధంగానే ఉంది. తమ ఎంపీలంతా సభకు తప్పక హాజరు కావాలని విప్ జారీచేసింది. అయితే తన పక్షాన్ని సభ ముందరుంచే అవకాశాన్ని మహువా మొయిత్రాకు ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పార్టీ కోరింది. సభలో ప్రవేశపెట్టక ముందే ఇది మీడియాకు లీకైందని టీఎంసీ ఆందోళన వ్యక్తంచేసింది. నైతిక కమిటీలోని ఆరుగురు సభ్యులు ఈ నివేదికకు అనుకూలంగా ఓటు వేయగా ప్రతిపక్షాలకు చెందిన నలుగురు సభ్యులు మాత్రం అభ్యంతరాలు తెలిపారు. ఈ నివేదికను ఫిక్స్‌డ్ మ్యాచ్‌గా విపక్షం విమర్శించింది. కాగా, ఈనెల 2వ తేదీన నైతిక కమిటీ సమావేశాన్ని మొయిత్రాతో పాటు ప్రతిపక్ష ఎంపీలు బహిష్కరించారు.

కల్బుర్గి, గౌరీ లంకేశ్ హత్య కేసుల విచారణకు

ప్రత్యేక న్యాయస్థానాలు

సిద్ధరామయ్య ఆదేశం



న్యూఢిల్లీ: ప్రముఖ హేతువాద రచయితలు, సామాజిక ఉద్యమకారులైన ఎంఎం కల్బుర్గి, జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్యలకు సంబంధించిన కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని కర్నాటక ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అత్యవసర చర్యలు తీసుకోవాల్సిందిగా మంగళవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాష్ట్ర హోంశాఖ కార్యదర్శిని ఆదేశించినట్లు హిందూస్థాన్ టైమ్స్ నివేదించింది. ఈ రెండు కేసుల్లో సారూప్యమున్న నిందితులు ఉన్నందున ఈ కేసులను కలిపి విచారించేందుకు బెంగళూరులో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసే అవకాశం ఉందని 'ది హిందు' వెల్లడించింది. రచయిత, కన్నడ పరిశోధన రంగంలో నిష్ణాతుడైన ఎంఎం కల్బుర్గి 2015 ఆగస్టు 30న హత్యకు గురయ్యారు. ధార్వాడ్‌లోని ఆయన నివాసంలోనే ఈ హత్య జరిగింది. అలాగే మూఢ నమ్మకాలపై పోరాడిన జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ 2017 సెప్టెంబరు 5న హత్యకు గురయ్యారు. బెంగళూరులోని తన ఇంటి బయట లంకేశ్‌ను దుండగులు కాల్చి చంపారు. కల్బుర్గి భార్య ఉమాదేవి, లంకేశ్ సోదరి కవిత... తమ వారి హత్యలపై విచారణలో జాప్యం గురించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాశారు. ఈ కేసులను త్వరితగతిన విచారించడానికి ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. కాగా ఈ రెండు కేసుల్లోనూ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు సంబంధించి అత్యవసర చర్యలు తీసుకోవాలని హోంశాఖ కార్యదర్శిని సిద్ధరామయ్య ఆదేశించినట్లు హిందుస్థాన్ టైమ్స్ పేర్కొంది. హిందూ వ్యతిరేక అభిప్రాయాలను వ్యక్తీకరించిన కారణంగానే వీరిద్దరూ హత్యకు గురయ్యారని కర్నాటకకు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) 2018లో దాఖలు చేసిన చార్జిషీట్‌లో పేర్కొంది. కల్బుర్గి కేసులో 143 మంది సాక్షులలో ఆరుగురు, లంకేశ్ కేసులో 530 మంది సాక్షులలో 97 మందిని ఇప్పటి వరకు విచారించినట్లు హిందూ వెల్లడించింది. లంకేశ్ కేసుకు సంబంధించి, సిట్ ఇప్పటివరకు 18 మందిని అరెస్టు చేసిందని సిద్ధరామయ్య రాష్ట్ర హోంశాఖ కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నట్లు హిందుస్థాన్ టైమ్స్ నివేదించింది. 'జులై 2022లో కోర్టు ఈ కేసులో విచారణ ప్రారంభించగా, కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఇతర కేసుల కారణంగా కేసు నెమ్మదిగా సాగుతోంది' అని ఆయన పేర్కొన్నారు. హేతువాదులు నరేంద్ర దభోల్కర్ , గోవింద్ పన్సారే అనే మరో ఇద్దరు కూడా తమ హిందూ వ్యతిరేక అభిప్రాయాల కారణంగా చంపబడ్డారని సిట్ 2018 నాటి చార్జిషీట్ నివేదించింది. అదే సంవత్సరంలో, ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఒక సీనియర్ పోలీసు అధికారిని ఉటంకిస్తూ 'దభోల్కర్, లంకేశ్, కల్బుర్గి హత్యలలో సారూప్య వ్యక్తుల ముఠా ప్రమేయం ఉంది' అని పేర్కొంది. దాదాపుగా ఈ ముఠాలోని సభ్యులందరికీ సనాతన సంస్థ, దాని అనుబంధ హిందూ జనజాగృతి సమితితో సంబంధాలు ఉన్నాయని కూడా ఆ అధికారి తెలిపారు. దభోల్కర్, కల్బుర్గి, పన్సారే, లంకేశ్‌ల హత్యల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందా లేదా అని పరిశీలించాలని ఈ ఏడాది ప్రారంభంలో సుప్రీంకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)ను ఆదేశించింది. కాగా కల్బుర్గి, లంకేశ్ కేసులపై పూర్తిస్థాయి న్యాయమూర్తితో ప్రత్యేక కోర్టు ఏర్పాటు ప్రక్రియకు మరో నెల రోజులు పడుతుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నట్లు ది హిందూ పేర్కొంది. కల్బుర్గి, గౌరీ లంకేశ్ కేసులను రోజువారీగా మాత్రమే విచారించే ప్రత్యేక కోర్టు... ఒకటిన్నర సంవత్సరాల వ్యవధిలో విచారణను పూర్తి చేయడంలో సహాయపడుతుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

తొమ్మిదేళ్లలో 16 కోట్ల ఉద్యోగాలెక్కడ?

- జుమ్లాగా మోదీ '2 కోట్ల' హామీ
- కార్మిక శాఖది కంటితుడుపు డేటా: వినయ్ విశ్వం



న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వానివి డొల్ల హామీలని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచిందని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాల హామీకి కంటి తుడుపుగా కార్మికశాఖ డేటా ఉన్నదని వ్యాఖ్యానించారు. ఉద్యోగాలను సృష్టించడంలో మోదీ సర్కార్ ఘోరంగా విఫలమైందని కార్మికశాఖ డేటాతో స్పష్టమైందన్నారు. ఉద్యోగాల సృష్టికి మోదీ ఇచ్చిన హామీ 'జుమ్లా'గా నిలిచిందని వినయ్ విశ్వం గురువారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. 'తొమ్మిదేళ్లలో రెండు కోట్ల ఉద్యోగాలు కూడా భర్తీ కాలేదని జాతీయ స్థాయి ఎన్‌సీఎస్ పోర్టల్ ద్వారా తేలింది. మరి మోదీ ఇచ్చిన హామీ ప్రకారం 16 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగం తారస్థాయికి చేరుతుండటంతో నిరుద్యోగులు/యువతలో అసహనం పెరుగుతోంది. ఉద్యోగాల సృష్టిలో అలసత్వం తగదు. దీనిని తీవ్రంగా పరిగణించేందుకు కేంద్రానికి ఇదే సమయం. ప్రధాని మోదీ అనుసరించే కార్పొరేట్ అనుకూల ఆర్థిక నమూనా ద్వారా యువతరం ఆకాంక్షలు నెరవేరబోవని రుజువైంది. ప్రభుత్వ రంగాన్ని పునరుద్ధరించడం, ఎంఎస్ఎమ్ఈలలో పెట్టుబడులు పెట్టడం, సుస్థిర ఉద్యోగాలు సృష్టించడం అవసరమేగానీ మోదీ ప్రాధాన్య తిచ్చే అదానీ వృద్ధిమార్గం కాదు' అని వినయ్ విశ్వం వ్యాఖ్యానించారు. ఉపాధి కల్పన/ఉద్యోగాల సృష్టి అంశమై పార్లమెంటులో తన ప్రశ్నకు లభించిన సమాధానం మీద ఆయన పై విధంగా స్పందించారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో లిస్ట్ అయిన ఖాళీలు 1.94 కోట్లని నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్ గుర్తించినట్లు వినయ్ విశ్వంకు సమాధానం లభించింది. మొత్తం 3.63కోట్ల నిరుద్యోగులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోగా వారి సంఖ్యలో సగానికి కాస్త ఎక్కువగానే ఖాళీలు లిస్ట్ అయ్యాయి. ఆమేరకు నియామకాలు జరిగినట్లు నిర్ధారించే డేటా పోర్టల్‌లో లేదు. ఉద్యోగాల భర్తీని నిర్ధారించడం పోర్టల్‌కు అనివార్యం కాదని ప్రకటన పేర్కొంది.

నేడు తిరుపతి, బాపట్ల జిల్లాలకు సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తుపాన్ ప్రభావిత తిరుపతి, బాపట్ల జిల్లాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం పర్యటిస్తారు. తుపాన్ తీవ్రతకు నష్టపోయిన పంటలు పరిశీలించి రైతులతో సీఎం మాట్లాడతారు. పంట నష్టం అంచనాలపై అధికారులతో సమీక్షిస్తారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాలేనికి సీఎం వెళ్తారు. అక్కడ తుపాన్‌తో దెబ్బతిన్న స్వర్ణ ముఖి నదిని పరిశీలిస్తారు. బాలిరెడ్డిపాలెంలో గ్రామస్తులు, తుపాన్ బాధితులతో సీఎం మాట్లాడతారు. అనంతరం బాపట్ల జిల్లా మరుప్రోలువారి పాలెం, పాతనందాయపాలెం, బుద్దాం గ్రామాలకు సీఎం వెళ్తారు. తుపాన్ ప్రభావంతో నష్టపోయిన మిర్చి, వరి పొలాలను సీఎం పరిశీలిస్తారు.

తుపాను బాధితుల సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మిచౌంగ్ తుపాను బాధితుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం ఏపీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తుపాన్ బాధితులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకోవడానికి సీపీఎం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో బాపట్ల, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో మూడు బృందాలు పర్యటించినట్లు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం సమస్యగా మారిందని, దీనిని యుద్ధప్రాతిపదికపై బాగుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో వసతులు అరకొరగా ఉన్నాయని, తిరిగి వెళ్లే వారికి ప్రభుత్వ హామీ మేరకు రూ.2వేలు ఇవ్వడంలేదని వెల్లడించారు. జగనన్న కాలనీలు సహా అనేక కాలనీలు నీట మునిగాయని, విద్యుత్, మంచినీరు లేక స్థానికులు అవస్థలకు గురవుతున్నారని, ధాన్యం, అరటి, తమలపాకు, శెనగ, పొగాకు, మిర్చి పంటలు దెబ్బ తిన్నాయని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీల పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు తప్ప పేదల కాలనీల్లోని సౌకర్యాల కల్పన అంతంత మాత్రమేనని శ్రీనివాసరావు విమర్శించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.